

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 15.06.2026 | సంపుటి: 3 | సంచిక: 133 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 15.06.2026 | V0LUME : 3 | ISSUE : 133 | PAGES: 8 | COST: 2/- |

## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



## వర్షాలపై అలసత్వం వద్దు
# కఠిన చర్యలు తప్పవు

**అధికారులు క్షేత్రస్థాయిలో అందు-బాటులో ఉండాలి**

**ట్రాఫిక్ జామ్‌లు, వాటర్ లాగింగ్‌పై సీఎం ఆగ్రహం**

**వర్షా కాల సన్నద్ధతపై ఉన్నతాధికారులతో సమీక్ష**

**హైదరాబాద్, జూన్ 14:**
వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అలసత్వంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పేవిలియన్‌లో వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ

మిగతా 2వ పేజీలో..

## భారతదేశపు అన్నపూర్ణ
# మన తెలంగాణ



**ధాన్యం సేకరణలో తెలంగాణ రికార్డు**

**150 లక్షల టన్నుల వరి కొనుగోలు**

**రైతులకు రూ.35,537 కోట్ల చెల్లింపులు**

**48–72 గంటల్లోనే డబ్బుల జమ**

**హైదరాబాద్, జూన్ 14:**
వ్యవసాయ రంగంలో తెలంగాణ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 150 లక్షల టన్నుల వరిని సేకరించి 'భారతదేశపు అన్నపూర్ణ'గా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పటిష్టమైన చర్యలు ధాన్యం సేకరణలో చారిత్రాత్మక ఫలితాలను అందించాయి.
ఈ సీజన్‌లో 26.43 లక్షల మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి గాను రూ.35,537 కోట్లను ప్రభుత్వం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ

మిగతా 2వ పేజీలో..

# ఫస్ట్ హాఫ్ డిజాస్టర్!



**రేవంత్ ప్రభుత్వానికి ఇంటర్వెల్ పడిపోయింది**

**సొంత పార్టీ నేతలనే మోసం చేసిన సీఎం**

**అవినీతిపై రాహుల్‌కు నివేదిక ఇచ్చిన మీనాక్షిపై పగ**

**ఖైరతాబాద్ సమావేశంలో కేటీఆర్ విమర్శలు**

**హైదరాబాద్, జూన్ 14(రాజముద్ర న్యూస్):**
బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వ్యాఖ్యానించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ కార్యకర్తల

మిగతా 2వ పేజీలో..

**పాలమూరులో కాంగ్రెస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారు** 2

# ఎస్ఐఆర్ పేరుతో విపక్షాల ఓట్లకు ఎసరు

- ఏఐ సాయంతో కాంగ్రెస్ మద్దతుదారుల గుర్తింపు
- ప్రజాస్వామ్యానికి ముప్పుగా కేంద్ర విధానాలు
- డిప్యూటీ సీఎం భట్టి సంచలన ఆరోపణలు



**హైదరాబాద్, జూన్ 14 (రాజముద్ర న్యూస్):**
ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అడ్డం పెట్టుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపక్షాలకు చెందిన ఓటర్ల పేర్లను పెద్దఎత్తున తొలగిస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియను అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రత్యేక నిఘా, సవరణ (ఎస్ఐఆర్) పేరుతో అసలైన ఓటర్ల

మిగతా 3వ పేజీలో..

**చరిత్రను, భవిష్యత్తును గుండెలకు హత్తుకున్న హైదరాబాద్** 3

## తెలంగాణ పర్యాటక రంగానికి కొత్త ఊపు

**పర్యాటకం, సంస్కృతి, వారసత్వ రంగాల్లో పురోగతి**

**రూ.15 వేల కోట్ల పెట్టుబడులు..**

**3 లక్షల ఉద్యోగాల లక్ష్యం**

**ప్రపంచస్థాయి పర్యాటక గమ్యస్థానంగా తెలంగాణ**

2





## దమ్ముంటే అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు రండి

- ముఖ్యమంత్రి పదవికి మేం ఇస్తున్న గౌరవాన్ని చేతకానితనంగా భావించొద్దు
- సీఎం రేవంత్‌కు ఎంపీ రఘునందన్ రావు సవాల్

3

## కనగల్‌లో సీఎం సభకు భారీ ఏర్పాట్లు

- రాష్ట్రవ్యాప్తంగా డబుల్ రోడ్లకు శంకుస్థాపన
- హ్యాం రోడ్లు, ఎస్ఎల్బీసీ పనులు 2028 నాటికి పూర్తి చేస్తాం: కోమటిరెడ్డి

2





## ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది

- కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతున్నాం
- ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ పాలన కోరుకుంటున్నారు: హరీష్ రావు

**హనుమకొండ, జూన్ 15 (రాజముద్ర న్యూస్):**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజావ్యతిరేక విధానాలు, అవినీతి, అరాచకాలపై ప్రధాన

మిగతా 3వ పేజీలో..

## మాదాపూర్‌లో డ్రగ్స్ పార్టీ భగ్నం

**వీకెండ్ పార్టీపై ఎస్‌వోటీ దాడులు.. 9 మంది అదుపులో**

**విజయవాడ నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠా గుట్టురట్టు**

**ఎండీఎంఏ, గంజాయి స్వాధీనం.. ఇద్దరు పరారీలో**

3





## మా మంత్రులు, ఎంపీలే అన్ని చేస్తే.. సీఎం ఎందుకు?

- తెలంగాణలో ఏ వర్గం సంతృప్తిగా లేదు
- హామీలు అమలు చేయలేక అబద్ధాలు చెబుతున్నారు
- రేవంత్ వద్ద ఇన్ని శాఖలు ఎందుకో చెప్పాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్ రావు విమర్శలు

3

## ప్రభుత్వ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి కిట్లు

- బూట్లు, బ్యాగులు, టైలు, బెల్టులతో పూర్తి సామగ్రి
- 27 లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు

**హైదరాబాద్, జూన్ 14 (రాజముద్ర న్యూస్):**
ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో నాణ్యమైన కిట్లను

మిగతా 3వ పేజీలో..






## అధికారం కోసం కాదు.. చైతన్యం కోసమే మా పోరాటం

3

- యువతే దేశ భవిష్యత్తును మార్చాలి
- పేపర్ లీకులు, పరీక్షల రద్దుకు ముగింపు పలకాలి
- సామాజిక ఉద్యమకారుడు సోనామ్ వాంగ్‌చుక్



# పాలమూరులో కాంగ్రెస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారు

- పాలమూరు ప్రాజెక్టును పక్కనపెట్టి జిల్లాకు ద్రోహం
- కొడంగల్‌లో రేవంత్ ఓటమి ఖాయం
- 2028లో ఉమ్మడి పాలమూరులో బీఆర్ఎస్ క్లీన్ స్వీప్
- జిల్లా నేతల సమావేశంలో కేటీఆర్ ధీమా

**హైదరాబాద్, జూన్ 14:**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పూర్తిగా తిరస్కరిస్తారని అన్నారు.

మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి నివాసంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్ష సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలతో జిల్లా రాజకీయ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు.

దాదాపు పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కనపెట్టి, లక్షల ఎకరాలకు సాగునీరు అందకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కమిషన్లు, కాంట్రాక్టుల కోసమే ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని పాలమూరు ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికల్లో తగిన సమాధానం చెబుతారని అన్నారు.

తాను మహబూబ్‌నగర్ బిడ్డనని చెప్పుకుంటూ జిల్లా ప్రజలను రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అన్ని రంగాల్లో జిల్లాకు అన్యాయం చేస్తున్న ముఖ్యమంత్రిని వచ్చే ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచే ప్రజలు ఓడిస్తారని జోస్యం చెప్పారు. గతంలో జరిగినట్లుగానే మరోసారి ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు.

తెలంగాణ ఏర్పాటుకు ముందు మహబూబ్‌నగర్ జిల్లా కరువు, వలసల జిల్లాగా ఉండేదని కేటీఆర్ గుర్తు చేశారు. అలాంటి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, కరువు, వలసలను తరిమికొట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అయితే ఆ అభివృద్ధిని ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించడంలో గత ఎన్నికల్లో పార్టీ విఫలమైందన్నారు.

కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రతి గ్రామానికి వివరించాలని పార్టీ నేతలకు కేటీఆర్ సూచించారు. ముఖ్యంగా పాలమూరు జిల్లాకు సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ చేస్తున్న అన్యాయాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో జిల్లాలోని క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రజాభిప్రాయాలు, పార్టీ బలోపేతంపై చర్చ జరిగింది. త్వరలో ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలపై కూడా నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించారు.

ప్రతి గ్రామంలో బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కేటీఆర్ సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఆదరణ పెరుగుతోందని, కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని నేతలు తనకు వివరించినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఫస్ట్ హాఫ్ డిజాస్టర్!

**మొదటిపేజీ తరువాయి**

సమావేశంలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇప్పటికే ఇంటర్వెల్ పడిపోయిందన్నారు. సినిమా ట్రైలర్ విడుదలైన వెంటనే అది హిట్టా, ఫట్టా అని అంచనా వేస్తారని, అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై తెలంగాణ ప్రజలు ఇప్పటికే తమ తీర్పు ఇచ్చేశారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ ఫస్ట్ హాఫ్ పూర్తిగా డిజాస్టర్‌గా మారిందని విమర్శించారు.

హైదరాబాద్ అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ఇల్లు కూడా నిర్మించలేదని, గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను మాత్రం కూల్చివేసిందని విమర్శించారు. ప్రజలకు అందాల్సిన ఆర్థిక సహాయాల విషయంలో కూడా ప్రభుత్వం బకాయిలు పెంచుకుంటూ పోతోందని అన్నారు.

ఎన్నికల సమయంలో ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా యువతను మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి తన సొంత పార్టీ నాయకులకే న్యాయం చేయలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి అవినీతి వ్యవహారాలపై కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాహుల్ గాంధీకి నివేదిక అందజేశారని కేటీఆర్ ఆరోపించారు. అందుకే ఆమెపై పగ పెంచుకుని తప్పుడు కేసులు పెట్టించారని అన్నారు. మీనాక్షికి రాజ్యసభ అవకాశం రాకుండా కూడా అడ్డుకున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో ప్రారంభించిన రూ.5 భోజన పథకానికి ‘అన్నపూర్ణ’ అనే పేరు పెట్టామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పేరును తొలగించి ‘ఇందిరమ్మ’గా మార్చిందని విమర్శించారు. అమ్మవారి పేరును కూడా తొలగించారని, అవకాశం దొరికితే జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి పేరును కూడా మార్చేస్తారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఖైరతాబాద్‌లో త్వరలో ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త తన డివిజన్‌లో కేసీఆర్ మాదిరిగా పని చేయాలని సూచించారు. ఇతర డివిజన్‌ల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తే ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# న్యాయం చేయమంటే నరకం చూపించాడు..!

**హనుమకొండ, జూన్ 14:**

హనుమకొండ జిల్లాలో పోలీసు శాఖను కలవరపరిచే ఘటన వెలుగులోకి వచ్చింది. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఓ మహిళను సహాయం చేస్తానంటూ నమ్మించి, నాలుగేళ్ల పాటు లైంగిక దాడులకు పాల్పడినట్లు ఓ ఎస్సైపై ఆరోపణలు రావడం సంచలనం రేపుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం, వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం ఆమె హనుమకొండ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. ఆ సమయంలో అక్కడ ఎస్సైగా పనిచేస్తున్న గోదారి రాజ్‌కుమార్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. భర్తతో విడాకుల వ్యవహారంలో చట్టపరమైన సహాయం అందిస్తానంటూ నమ్మకం కల్పించిన అతడు, ఆమెతో సన్నిహితంగా మెలిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం మహిళ బలహీన పరిస్థితిని ఆసరాగా చేసుకుని బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎల్కతుర్తి, హనుమకొండ ప్రాంతాల్లో గత నాలుగేళ్లుగా పలుమార్లు తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించింది. ఈ వేధింపులను భరించలేక చివరకు ఉన్నతాధికారులను ఆశ్రయించినట్లు తెలిపింది. తనకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారి తనను మోసం చేసి వేధించాడంటూ బాధితురాలు రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేసింది.

# తెలంగాణ పర్యాటక రంగానికి కొత్త ఊపు

**తెలంగాణ బ్యూరో:***

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు పర్యాటక శాఖ వెల్లడించింది. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తొలిసారిగా తెలంగాణ టూరిజం పాలసీ 20252030ను అమలు చేసిన ప్రభుత్వం, రూ.15 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి మూడు లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ముందుకు సాగుతోంది. పీపీపీ విధానంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సుస్థిర పర్యాటకం, డిజిటల్ ప్రచారం, అంతర్జాతీయ బ్రాండింగ్, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది.

రాష్ట్రంలో పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు శాఖ వెల్లడించింది. 2023లో 5.84 కోట్లుగా ఉన్న దేశీయ పర్యాటకుల సంఖ్య 2024లో 8.82 కోట్లకు చేరగా, 2025లో 8.48 కోట్ల మంది తెలంగాణ పర్యాటక ప్రాంతాలను సందర్శించినట్లు తెలిపింది. విదేశీ పర్యాటకుల రాక కూడా 2024తో పోలిస్తే 2025లో పది శాతానికి పైగా పెరిగినట్లు పేర్కొంది.

**పెట్టుబడుల ఆకర్షణలో ముందడుగు**

టూరిజం కాన్‌క్లేవ్2025 ద్వారా 24 మంది పెట్టుబడిదారుల నుంచి రూ.15,285 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చినట్లు వెల్లడించింది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో 18 మంది పెట్టుబడిదారులతో రూ.8,456 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదిరాయని, వీటి ద్వారా 10 వేల ప్రత్యక్ష, 30 వేల పరోక్ష ఉద్యోగాలు లభించనున్నాయని తెలిపింది.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.181 కోట్ల విలువైన పర్యాటక ప్రాజెక్టులు మంజూరయ్యాయి. బుద్ధవనం, రామప్ప, సోమశిల, నిజాంసాగర్, బల్కంపేట ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.289 కోట్లతో 71 పర్యాటక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది.



**రోప్‌వేలు.. అడ్వెంచర్ టూరిజానికి ప్రాధాన్యం**

భువనగిరి కోట, ఖమ్మం కోటల వద్ద తొలిసారిగా రోప్‌వే ప్రాజెక్టులు చేపట్టగా, సోమశిల, హుస్సేన్ సాగర్, కోటిపల్లి ప్రాంతాల్లో అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్ ప్రారంభించారు. హుస్సేన్ సాగర్‌లో ముచుకుంద లగ్జరీ డబుల్ డెక్ క్రూయిజ్ సేవలు ప్రారంభించగా, లక్నాపూర్, నిజాంసాగర్, వరదవెల్లి ప్రాంతాల్లో బోటింగ్ సౌకర్యాలను విస్తరించారు.

**ప్రపంచ వేదికపై తెలంగాణ**

72వ మిస్ వరల్డ్ 2025 పోటీలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, వారసత్వం, కళలు, హస్తకళలు, పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభించిందన్నారు.

ప్రతి ఏడాది నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ దేశ విదేశాల సందర్శకులను ఆకట్టుకుంటోందన్నారు. 2026 ఉత్సవాల్లో 18 దేశాల ప్రతినిధులు, 37 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్లు, 55 మంది దేశీయ కైట్ ఫ్లయర్లు పాల్గొన్నట్లు వెల్లడించారు. హాట్ ఎయిర్ బెలూన్, డ్రోన్ ఫెస్టివల్‌ల ద్వారా పర్యాటక రంగానికి కొత్త ఆకర్షణలు జోడించినట్లు చెప్పారు.

**బతుకమ్మకు గిన్నిస్ రికార్డులు**

బతుకమ్మ ఉత్సవాలు2025 సందర్భంగా తెలంగాణ రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిందని మంత్రి తెలిపారు. అతిపెద్ద బతుకమ్మ పూల అలంకరణతో పాటు 1,354 మంది మహిళలతో నిర్వహించిన సమన్వయ బతుకమ్మ నృత్య ప్రదర్శన ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుందని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో సోమశిల, నిర్మల్ గ్రామాలు ‘బెస్ట్ టూరిజం విలేజ్ ఆఫ్ ఇండియా2024’ అవార్డులు అందుకోగా, హైదరాబాద్‌కు ‘బెస్ట్ హెరిటేజ్ టూరిజం’ మరియు ‘బెస్ట్ ఇండిజినస్ క్యులినరీ డెస్టినేషన్’ అవార్డులు లభించాయని తెలిపారు.

**కళాకారుల సంక్షేమానికి ప్రాధాన్యం**

రాష్ట్రంలో 1,690 మంది వృద్ధ కళాకారులకు నెలకు రూ.3,016 చొప్పున పెన్షన్ అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రవీంద్రభారతిలో నిర్వహించిన 99 రోజుల తెలంగాణ ప్రజా కళా కార్యక్రమం ద్వారా జానపద, గిరిజన, సంప్రదాయ కళారూపాలకు ప్రోత్సాహం లభించిందన్నారు. పురావస్తు రంగంలో ఫణిగిరి, మాడుముల ప్రాంతాల్లో తవ్వకాల ద్వారా చారిత్రక ఆధారాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఫణిగిరిలో బౌద్ధ మ్యూజియం ఏర్పాటు చేసి పలు చారిత్రక కట్టడాల సంరక్షణ చేపట్టినట్లు వివరించారు.

**తెలంగాణకు కొత్త గుర్తింపు**

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పర్యాటకం, సంస్కృతి, వారసత్వ రంగాల్లో చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా తెలంగాణ దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు పొందుతోందన్నారు. పెట్టుబడులు, ఉపాధి, పర్యాటకాభివృద్ధి, వారసత్వ పరిరక్షణ, కళాకారుల సంక్షేమం అనే ఐదు ప్రధాన లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. తెలంగాణను ప్రపంచస్థాయి పర్యాటక, సాంస్కృతిక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు మరింత వేగంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

## వర్షాలపై అలసత్వం వద్దు

# కఠిన చర్యలు తప్పవు

**మొదటిపేజీ తరువాయి**

సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

జూన్ 9న హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాల సమయంలో ఏర్పడిన పరిస్థితులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సైబరాబాద్ సహా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ శాఖలు తగిన స్థాయిలో స్పందించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.



వర్షాల సమయంలో మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందని సీఎం అన్నారు. దీనికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.

వర్షాలు కురిసే సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి, సివిల్ పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండాలని స్పష్టం చేశారు. అవసరమైతే తాను కూడా రోడ్లపైకి వస్తానని చెప్పారు. వర్షాల కారణంగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడితే ఇకపై బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాటర్ లాగింగ్ పాయింట్లు, ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉండే ప్రాంతాలపై ముందుగానే ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ విభాగంలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డీజీపీకి ఆదేశించారు.

వర్షాల కారణంగా చెట్లు కూలి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంపై కూడా ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ వేగంగా చేపట్టాలని, అవసరమైన చోట్ల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.

రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద వర్షాకాలంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్వహణ మాన్యువల్ ప్రకారం జరగాలని, సంబంధిత ఇంజినీర్లు స్థానికంగానే అందుబాటులో ఉండాలని చెప్పారు. అనుమతి లేకుండా విధులు వదిలి వెళ్లే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో విత్తనాలు, యూరియా సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖకు సూచించారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేపట్టాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

తాగునీటి కలుషితాన్ని నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను ఆదేశించారు. నీటి నమూనాలను ఎప్పటికప్పుడు పరీక్షించాలని సూచించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని వైద్య ఆరోగ్య శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని చెప్పారు.

పోలీసు, ట్రాఫిక్, ఫైర్, హైడ్రా, విపత్తు నిర్వహణ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని డీజీపీని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## భారతదేశపు అన్నపూర్ణ మన తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

చేసింది. దళారీల ప్రమేయం లేకుండా, పారదర్శక విధానంలో చెల్లింపులు జరపడం ద్వారా రైతుల్లో విశ్వాసాన్ని పెంపొందించింది.

రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునేలా రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంతాల రైతులకు సైతం అందుబాటులో ఉండేలా కొనుగోలు వ్యవస్థను విస్తరించింది.

ధాన్యం సేకరణ, రవాణా, నిల్వ, మిల్లింగ్, చెల్లింపుల ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించడంతో రైతులకు వేగంగా డబ్బులు అందుతున్నాయి. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన 48 నుంచి 72 గంటల్లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ కావడం విశేషం.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సాగునీటి వసతుల విస్తరణ, మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు, వేగవంతమైన చెల్లింపుల ద్వారా తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తోంది. దీంతో రాష్ట్రం దేశంలోనే వ్యవసాయ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తోంది.

# కనగల్‌లో సీఎం సభకు భారీ ఏర్పాట్లు

**కనగల్, జూన్ 14:**

నల్గొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలో ఈ నెల 17న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పరిశీలించారు. సభా స్థలం, హెలిప్యాడ్, హ్యాం రోడ్ల పైలాన్ ప్రాంతాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.



ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా హ్యాం విధానంలో చేపట్టనున్న డబుల్ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కనగల్ మండలం ధర్వేశిపురం నుంచి డిండి వరకు నిర్మించనున్న రహదారితో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు.

హ్యాం రోడ్లతో పాటు మరో రూ.7 వేల కోట్ల వ్యయంతో గ్రామాల నుంచి మండలాలకు, మండలాల నుంచి జిల్లా కేంద్రాల వరకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో డబుల్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పనులకు కూడా త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన జరగనున్నట్లు తెలిపారు. గత ఏడాది కాలంగా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి అవసరమైన నిధులు సమకూర్చుకుని రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధి చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో 34 ప్యాకేజీలుగా విభజించి సుమారు 6,300 కిలోమీటర్ల రహదారులను డబుల్ రోడ్లుగా మార్చనున్నట్లు చెప్పారు. నల్గొండ జిల్లాకు కీలకమైన ఎస్ఎల్బీసీ సొరంగం పనులను కూడా 2028 ఆగస్టు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తైతే జిల్లాలో రెండు పంటలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఇది తన కలల ప్రాజెక్టు అని అన్నారు.

ఏఆర్పీ కాలువల లైనింగ్ పనులకు రూ.450 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వాటి శంకుస్థాపన కూడా అదే రోజు జరగనున్నట్లు వెల్లడించారు. నల్గొండ నగరంలో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయించామని, ఆ పనులకు కూడా ముఖ్యమంత్రి కనగల్‌లోనే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

**రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది**

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి చెప్పారు. ఈ ఏడాది నల్గొండ నియోజకవర్గంలో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, జిల్లా వ్యాప్తంగా రూ.1,800 కోట్ల విలువైన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రోడ్ల అభివృద్ధితో పరిశ్రమలు, వ్యవసాయం అభివృద్ధి చెందడంతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుతాయని అన్నారు. కేంద్ర నిధులతో నల్గొండ నుంచి ధర్వేశిపురం వరకు స్ట్రెయిట్ రోడ్ నిర్మాణం చేపట్టామని, కనగల్ జంక్షన్ అభివృద్ధిని కూడా హ్యాం రోడ్ల ప్రాజెక్టులో చేర్చినట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేకు ఆమోదం లభించిందని, దానికి అనుబంధంగా బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ కూడా సిద్ధమవుతోందని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి సభకు సుమారు లక్ష మంది హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, టెంట్లు, పార్కింగ్, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు.

సభా వేదిక, లైటింగ్, ప్రత్యక్ష ప్రసారం, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు ప్రత్యేక సూచనలు చేసిన మంత్రి, ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, అల్పాహారం, ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి వివరించారు.

# ఎస్ఐఆర్ పేరుతో విపక్షాల ఓట్లకు ఎసరు

మొదటిపేజీ తరువాయి

హక్కులను కాలరాస్తున్నారని భట్టి అన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చే ఓటర్లను లక్ష్యంగా చేసుకుని, వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో సరైన ధృవీకరణ లేకుండానే విపక్షాల ఓట్లను తొలగించే చర్యలు కొనసాగుతున్నాయని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారని భట్టి ఆరోపించారు. సోషల్ మీడియా పోస్టులు, డిజిటల్ కార్యకలాపాలను విశ్లేషించి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపే ఓటర్లను కృత్రిమ మేధ సాయంతో గుర్తిస్తున్నారని తెలిపారు. అలా గుర్తించిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం లేదా నిలిపివేయడం జరుగుతోందని విమర్శించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు కేవలం ఓటు హక్కును హరించడం మాత్రమే కాదని భట్టి పేర్కొన్నారు. ప్రభుత్వ రికార్డుల నుంచి ఒక వ్యక్తి పేరును అన్యాయంగా తొలగించడం వల్ల భవిష్యత్తులో వారి పౌరసత్వ హక్కులపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది అత్యంత ప్రమాదకరమైన పరిణామమని వ్యాఖ్యానించారు. ఈ అంశం ఒక రాష్ట్రానికే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని భట్టి ఆరోపించారు. ఎన్నికల్లో అక్రమ రాజకీయ లబ్ధి పొందడానికే ప్రజల తీర్పును ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యవాదులు, పౌరసమాజం, రాజకీయ పార్టీలు ఈ పరిణామాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# చరిత్రను, భవిష్యత్తును గుండెలకు హత్తుకున్న హైదరాబాద్

- నగర ఆత్మ సలార్ జంగ్ మ్యూజియం
- మత సామరస్యానికి సజీవ సాక్ష్యంగా నిలిచిన వారసత్వ సంపద
- పర్యాటకాభివృద్ధితో వేల మందికి ఉపాధి కల్పిస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూన్ 14:

సలార్ జంగ్ మ్యూజియం హైదరాబాద్ నగర ఆత్మకు ప్రతిరూపమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కొన్ని సంస్థలను నగరాలు నిర్మిస్తే, మరికొన్ని సంస్థలు ఆ నగర ఆత్మను నిర్మిస్తాయని పేర్కొన్నారు. సలార్ జంగ్ మ్యూజియం 75వ వార్షికోత్సవాలు, మీర్ యూసుఫ్ అలీఖాన్ (సలార్ జంగ్3) 137వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.

ప్రపంచ నాగరికతలను భద్రపరిచిన మహోన్నత వ్యక్తి సలార్ జంగ్3 అని భట్టి కొనియాడారు. 43 వేలకుపైగా కళాఖండాలను సేకరించడం సాధారణ విషయం కాదని, అది కళలపై ఆయనకున్న అపారమైన అభిరుచి, అంకితభావానికి నిదర్శనమని అన్నారు. ప్రపంచ చరిత్రను, సౌందర్యాన్ని తన సొంత సంపదతో సేకరించి ప్రజల ఆస్తిగా మార్చిన మహనీయుడని పేర్కొన్నారు.

ఈ మ్యూజియంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ సంప్రదాయాలకు చెందిన అరుదైన కళాఖండాలు ఒకే చోట ఉన్నాయని భట్టి తెలిపారు. విష్ణుమూర్తి దశావతారాలు, ఖురాన్ శ్లోకాలతో కూడిన కళావస్తువులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని చెప్పారు. ఇది కేవలం లౌకికవాదంపై ప్రసంగం కాదని, లౌకికత్వానికి సజీవ సాక్ష్యమని వ్యాఖ్యానించారు.

మ్యూజియం పక్కనే ప్రవహించే మూసి నది హైదరాబాద్ జ్ఞాపకాల ప్రవాహమని భట్టి పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన మూసిని ప్రక్షాళన చేసి అంతర్జాతీయ స్థాయి రివర్‌ఫ్రంట్‌గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. లండన్ థేమ్స్, పారిస్ సీన్ నదుల తరహాలో మూసిని తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. సలార్ జంగ్ మ్యూజియంను అభివృద్ధి చెందిన మూసి రివర్‌ఫ్రంట్‌కు సాంస్కృతిక కిరీటంగా మార్చే ప్రణాళిక సిద్ధమవుతోందన్నారు. పర్యాటకులు నది గుండా ప్రయాణిస్తూ చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను వీక్షించేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

హైదరాబాద్ అంటే కేవలం చార్మినార్ మాత్రమే కాదని, సైబర్ టవర్స్ నగరం కూడా అని భట్టి పేర్కొన్నారు. ఐటీ, బయోటెక్నాలజీ, ఔషధ రంగాల్లో ప్రపంచస్థాయి గుర్తింపు సాధించిన నగరంగా హైదరాబాద్ ఎదిగిందన్నారు. చరిత్రను, భవిష్యత్తును సమానంగా గుండెలకు హత్తుకున్న నగరం హైదరాబాద్ అని వ్యాఖ్యానించారు. చార్మినార్, గోల్కొండ, కుతుబ్‌షాహీ సమాధులు, చౌమహల్లా ప్యాలెస్, ఫలక్‌నుమా ప్యాలెస్‌లతో కూడిన ఓల్డ్ సిటీ హెరిటేజ్ సర్క్యూట్‌ను సలార్ జంగ్ మ్యూజియంతో అనుసంధానిస్తామని తెలిపారు. నైట్ టూరిజం, బహుభాషా గైడెడ్ టూర్లను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. వారసత్వ సంపద కేవలం గర్వపడటానికే కాదని, స్థానిక కళాకారులు, గైడ్‌లు, హోటళ్లు, రవాణా రంగాలకు ఉపాధి కల్పించే ఆర్థిక వనరుగా మారాలని భట్టి అన్నారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా వేలాది మందికి జీవనోపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి సలార్ జంగ్ మ్యూజియాన్ని సందర్శించి 'ఇది నా ఆస్తి' అనే భావన పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యం కుదుర్చుకుని విద్యార్థుల్లో చరిత్ర, సంస్కృతిపై అవగాహన పెంచుతామని తెలిపారు. ఐటీ, వ్యాపార అవసరాల కోసం హైదరాబాద్‌కు వచ్చే విదేశీ పెట్టుబడిదారులు కూడా నగర సంస్కృతిని ఆస్వాదించాలని భట్టి కోరారు. బిర్యానీ, హలీమ్, ఇరానీ చాయ్ వంటి సంప్రదాయాలు తెలంగాణ సాంస్కృతిక ఆర్థిక వ్యవస్థకు ప్రతీకలని అన్నారు. ఈ 75 ఏళ్లుగా మ్యూజియాన్ని సంరక్షిస్తూ వస్తున్న క్యూరేటర్లు, భద్రతా సిబ్బంది, పరిపాలనా ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సలార్ జంగ్3 సేకరించిన అమూల్యమైన వారసత్వ సంపదను ఆధునీకరించి భావితరాలకు అందించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినవారమవుతామని భట్టి విక్రమార్క అన్నారు.

# ప్రభుత్వ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి కిట్లు

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. యూనిఫాంలతో పాటు బూట్లు, సాక్సులు, స్కూల్ బ్యాగులు, టైలు, బెల్టులు, బెడ్డింగ్ సామగ్రి వంటి పలు వస్తువులను విద్యార్థులకు పంపిణీ చేయనుంది. విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. యూనిఫాం వస్త్రం కొనుగోలు నుంచి కుట్టు వరకు ప్రతి దశలో నాణ్యతకు పెద్దపీట వేయాలని సూచించారు. దీంతో ఈసారి పేరెన్నికగన్న సంస్థల నుంచి యూనిఫాం వస్త్రాన్ని సేకరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందించేందుకు ప్రభుత్వం 2.97 కోట్ల మీటర్ల వస్త్రాన్ని కొనుగోలు చేస్తోంది. విద్యార్థుల కోసం యూనిఫాం రంగుల్లో కూడా మార్పులు చేసింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లైట్ బ్లూ, డార్క్ బ్లూ రంగుల యూనిఫాంలు, గురుకుల విద్యార్థులకు మెరూన్ రంగు యూనిఫాంలు అందించనున్నారు. యూనిఫాం కుట్టు పనిని మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది యూనిఫాంల తయారీలో మహిళలు నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ ద్వారా మహిళా సంఘాలకు రూ.40 కోట్లకు పైగా ఆదాయం లభించనుంది. ఈసారి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తొలిసారిగా నల్లటి బూట్లు, బెల్టులు అందించనున్నారు. గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాల విద్యార్థులకు బెల్టు, టై, ఐడీ కార్డు, స్కూల్ బ్యాగు, బూట్లు, సాక్సులు, బెడ్డింగ్ సామగ్రి, ప్లేటు, గ్లాసు, కటోరా, ట్రంక్ బాక్స్, పీటీ డ్రెస్, నైట్ డ్రెస్, ట్రాక్ సూట్‌తో కూడిన పూర్తి కిట్ అందించనున్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు రెండు లక్షల మంది విద్యార్థులకు కూడా బ్యాగులు, బెల్టులు, టైలు, బూట్లు, సాక్సులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఇప్పటికే ఆయా పాఠశాలలకు చేరాయి. విద్యాసంవత్సరం ప్రారంభమైన తొలి వారంలోనే వాటి పంపిణీ పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థులకు నాణ్యమైన సామగ్రి అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.687.78 కోట్లు వెచ్చిస్తోంది. దీనిని ఖర్చుగా కాకుండా భావితరాల భవిష్యత్తుపై పెట్టుబడిగా ప్రభుత్వం భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. యూనిఫాంలు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, కార్పెట్ల తయారీ ఆర్డర్లలో భాగాన్ని తెలంగాణ చేనేత సహకార సంస్థకు అప్పగించగా, టైలు, బెల్టులు, ఐడీ కార్డుల తయారీ బాధ్యతలను తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్‌కు అప్పగించారు. దీంతో చేనేత కార్మికులు, వివిధ రంగాల కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. గతంలో ఉన్న అవకతవకలకు అడ్డుకట్ట వేయడానికి ఈసారి రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా కేంద్రీకృత కొనుగోలు విధానాన్ని అమలు చేస్తోంది. దీంతో అన్ని యాజమాన్యాల విద్యార్థులకు ఒకే ప్రమాణాలతో, ఒకే సమయంలో నాణ్యమైన యూనిఫాంలు, కిట్లు అందనున్నాయి.

# మాదాపూర్‌లో డ్రగ్స్ పార్టీ భగ్నం

హైదరాబాద్, జూన్ 14:

హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలోని మాదాపూర్‌లో నిర్వహిస్తున్న డ్రగ్స్ పార్టీని ఎస్‌వోటీ పోలీసులు భగ్నం చేశారు. నమ్మకమైన సమాచారంతో శనివారం అర్ధరాత్రి నిర్వహించిన దాడుల్లో పార్టీ నిర్వాహకుడితో పాటు మొత్తం తొమ్మిది మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, మాదాపూర్ పరిధిలోని చంద్రనాయక్ తండాలో ఉన్న ఎంబీఎస్ భాగ్యలక్ష్మి అపార్ట్‌మెంట్స్‌లోని ఓ ఫ్లాట్‌లో డ్రగ్స్ పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందింది. దీంతో ఎస్‌వోటీ బృందాలు ఆకస్మికంగా దాడులు నిర్వహించాయి. వీకెండ్ సందర్భంగా ప్రత్యేకంగా విజయవాడ నుంచి కొందరు యువకులు హైదరాబాద్‌కు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. దాడుల్లో పార్టీ నిర్వాహకుడిగా భావిస్తున్న దనేకుల తరుణ్ తేజతో పాటు మరో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మాదకద్రవ్యాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో విజయవాడకు చెందిన కార్తీక్, పృథ్వీ అనే వ్యక్తులు ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరు దనేకుల తరుణ్ తేజ ద్వారా హైదరాబాద్‌లో యువతకు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్నట్లు వెల్లడైంది. నిందితుల వద్ద నుంచి 15 గ్రాముల ఎండీఎంఏ, 382 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 9 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల విలువ లక్షల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రధాన నిర్వాహకుడు తరుణ్ తేజను అరెస్ట్ చేసిన పోలీసులు, పరారీలో ఉన్న కార్తీక్, పృథ్విల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ముఠాకు మరెవ్వరితో సంబంధాలు ఉన్నాయా, నగరంలో ఇంకెక్కడైనా డ్రగ్స్ సరఫరా చేస్తున్నారా అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.



# మా మంత్రులు, ఎంపీలే అన్ని చేస్తే.. సీఎం ఎందుకు?

హైదరాబాద్, జూన్ 14:

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను నిరాశపరిచిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్ రావు విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అంబర్‌పేట్ నియోజకవర్గంలో నిర్వహించిన బీజేపీ విస్తృత స్థాయి సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పాల్గొన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

రాష్ట్రంలో ప్రస్తుతం ఏ వర్గం ప్రజలు కూడా సంతృప్తిగా లేరని రాం చందర్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీని అబద్ధాలకు తల్లిగా అభివర్ణించిన ఆయన, హామీలను అమలు చేయలేక ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో చెప్పిన మాటలకు, ప్రస్తుతం చేస్తున్న పనులకు ఎలాంటి పొంతన లేదన్నారు.

రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆ ఘనతను తమ ఖాతాలో వేసుకుని ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కోసం కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరుతున్నారని, అన్ని పనులు కేంద్ర మంత్రులు, ఎంపీలు చేస్తే ముఖ్యమంత్రి పదవిలో ఎందుకు కొనసాగుతున్నారని ప్రశ్నించారు.

హైదరాబాద్‌లో ఒక్కరోజు వర్షం పడితేనే నగరం అతలాకుతలమైందని రాం చందర్ రావు అన్నారు. దీనికి మున్సిపల్ శాఖ బాధ్యత వహించాల్సి ఉందని, ఆ శాఖను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై కూడా ఆయన విమర్శలు చేశారు. ఫ్యూచర్ సిటీలో రేవంత్ రెడ్డికి రాజకీయ భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు. రాబోయే మూడు మున్సిపాలిటీల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు మధ్యవర్తిగా ఎంఐఎం వ్యవహరిస్తోందని రాం చందర్ రావు ఆరోపించారు. ఈ మూడు పార్టీలు కలిసి హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ప్రజాసేవ కోసం కాకుండా కమిషన్ల కోసం ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి వద్ద అనేక శాఖలు, బాధ్యతలు ఎందుకు ఉన్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఏమి చేసిందనే అంశంపై సచివాలయం గేట్ ముందు బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి ముందుగా హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల అభివృద్ధిపై మాట్లాడాలని, ఆ తర్వాత ఫ్యూచర్ సిటీ గురించి మాట్లాడాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టకుండా ప్రచార రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

## దమ్ముంటే అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు రండి

మెదక్, జూన్ 14:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రస్థాయిలో స్పందించారు. రాష్ట్రంలోని ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. ముఖ్యమంత్రి కూడా తన పదవికి రాజీనామా చేసి శాసనసభను రద్దు చేసి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్‌కు చెందిన ఎనిమిది మంది ఎంపీలను అలాగే ఉంచుకోవచ్చని, ప్రజాక్షేత్రంలో ఎవరికెంత బలం ఉందో ఎన్నికల్లో తేల్చుకుందామని అన్నారు. ముఖ్యమంత్రి పదవికి తాము ఇస్తున్న గౌరవాన్ని, తమ సంస్కారాన్ని చేతకానితనంగా భావించవద్దని హెచ్చరించారు. రాజకీయంగా తాము కూడా దీటుగా సమాధానం చెప్పగలమని రఘునందన్ రావు స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి ముందు వడ్లు పోస్తామని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం సరికాదన్నారు. అలాంటి చర్యలు తమకు కూడా చేయడం వచ్చని, అవసరమైతే కొడంగల్‌లో గానీ, ప్రజా భవన్ ముందు గానీ వడ్లు పోయగలమని వ్యాఖ్యానించారు.

రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ సవాళ్లు, విమర్శల కంటే రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై, బీజేపీపై అనవసర ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

ప్రజల్లో తమకు మద్దతు ఉందనే నమ్మకం ఉంటే ముఖ్యమంత్రి వెంటనే అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు వెళ్లాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ప్రజలే అంతిమ న్యాయ నిర్ణేతలని, వారి తీర్పుతో ఎవరి బలం ఎంత ఉందో స్పష్టమవుతుందని అన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ధాన్యం కొనుగోలు, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజకీయ వివాదాల కంటే ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత కావాలని రఘునందన్ రావు అన్నారు.

## ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది

మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సమర్థవంతంగా పోరాటం చేస్తోందని మాజీ మంత్రి, అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అన్నారు.

హనుమకొండలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న తప్పుదోవ పట్టించే విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అవినీతి, వైఫల్యాలను బట్టబయలు చేస్తూ ప్రజల తరపున నిరంతరం పోరాడుతున్నామని చెప్పారు.

బీఆర్ఎస్ కార్యకర్తల అండదండలతోనే ఈ పోరాటం మరింత బలంగా కొనసాగుతోందని హరీష్ రావు పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని అన్నారు.


కేసీఆర్ పాలనలో అమలైన సంక్షేమ పథకాల వెనుక స్పష్టమైన విజన్ ఉందని హరీష్ రావు తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయని చెప్పారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాల వల్ల మాతాశిశు మరణాల రేటు తగ్గిందని పేర్కొన్నారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి గురుకుల పాఠశాలలు ఎంతో దోహదపడ్డాయని తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ తగ్గడంలో కూడా గురుకులాల పాత్ర కీలకమైందన్నారు.

మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించడంతో పాటు ఫ్లోరైడ్ సమస్యను అధిగమించామని చెప్పారు. మిషన్ కాకతీయ, చెక్‌డ్యాంలు, సాగునీటి ప్రాజెక్టులతో వ్యవసాయ రంగానికి బలమైన పునాది వేశామని పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యలు తగ్గడంలో ఈ పథకాలు కీలక పాత్ర పోషించాయని అన్నారు. హిందూ, ముస్లిం వర్గాలను కేసీఆర్ సమాన దృష్టితో చూసారని, అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేశారని హరీష్ రావు తెలిపారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, మళ్లీ బీఆర్ఎస్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యత అని చెప్పారు. భవిష్యత్తులో కూడా కార్యకర్తల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను కొనసాగిస్తామని హరీష్ రావు స్పష్టం చేశారు.

## అధికారం కోసం కాదు.. చైతన్యం కోసమే మా పోరాటం

హైదరాబాద్, జూన్ 14:



హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వేదికగా ఆదివారం నిర్వహించిన వినూత్న నిరసన కార్యక్రమంలో ప్రముఖ సామాజిక, పర్యావరణ ఉద్యమకారుడు సోనామ్ వాంగ్‌చుక్ పాల్గొన్నారు. 'కాక్రోజ్ జనతా పార్టీ' ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువతను ఉద్దేశించి ఆయన ఉద్వేగభరితంగా ప్రసంగించారు. దేశ భవిష్యత్తును యువతే ముందుకు నడిపించాలని, తాను వంటి వారు వారికి మార్గనిర్దేశం చేస్తూ ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటారని పిలుపునిచ్చారు.

తమకు విద్యాశాఖ మంత్రి కావాలనే ఆశగానీ, కొత్త రాజకీయ పార్టీ ద్వారా అధికారంలోకి రావాలనే లక్ష్యంగానీ లేదని సోనామ్ వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. కాక్రోజ్ జనతా పార్టీ అనేది అధికార రాజకీయాల కోసం ఏర్పడిన వేదిక కాదని, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి చేస్తున్న ఒక పవిత్ర ప్రయత్నమని పేర్కొన్నారు. యువతను మేల్కొలిపి సమాజంలో మార్పు తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమన్నారు.

దేశంలో తరచూ జరుగుతున్న పేపర్ లీకులు, పరీక్షల రద్దు వంటి ఘటనలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవస్థలో తప్పు జరిగినప్పుడు మంత్రి నుంచి ప్రధానమంత్రి వరకు అందరూ ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందేనని అన్నారు. విద్యను కేవలం పరీక్షలకు పరిమితం చేయకుండా, విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్ది భావితరాలకు బలమైన పునాది వేయాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ కూడా విద్యంతే ముఖ్యమని సోనామ్ వాంగ్‌చుక్ అన్నారు. రాబోయే తరాలకు చదువు ఎంత అవసరమో, స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు కూడా అంతే అవసరమని గుర్తు చేశారు. ఈ విషయంలో హైదరాబాద్ ప్రజలు చేస్తున్న పోరాటం దేశానికే ఆదర్శమని కొనియాడారు.

కేబీఆర్ పార్క్ పరిరక్షణ కోసం నగరవాసులు చేపట్టిన ఉద్యమాలు, భూములు, నదులను కాపాడేందుకు చూపుతున్న చొరవను ఆయన అభినందించారు. అడవులను నరికివేసి కాంక్రీట్ నిర్మాణాలు, ఫ్లైఓవర్లు నిర్మిస్తే అభివృద్ధి సాధించినట్టే అనే తప్పుడు భావనలో ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. కాంక్రీట్ అడవులు మన పిల్లల భవిష్యత్తును కాపాడలేవని హెచ్చరించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రకృతి సంపదలను కాపాడుకోవడానికి ప్రజలందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. అడవులు, నదులు, పర్యావరణాన్ని సంరక్షించేందుకు ప్రజలు గట్టిగా గొంతు విప్పినప్పుడే మార్పు సాధ్యమవుతుందని చెప్పారు. దీర్ఘకాలంలో విద్యను, పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ముందుగా నిజాయితీగా పనిచేసే ప్రజాస్వామ్య వ్యవస్థ అవసరమని సోనామ్ వాంగ్‌చుక్ అభిప్రాయపడ్డారు.



# రామమందిర విరాళాల వివాదం

**ఆరోపణలతో రాజకీయ దుమారం**

**దర్యాప్తుపై పెరుగుతున్న ఒత్తిడి**

**సిట్ ఏర్పాటు చేసిన యూపీ**

**అయోధ్య, జూన్ 14 :** అయోధ్యలోని రామమందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల వినియోగంపై వచ్చిన ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. విరాళాల నిర్వహణలో పారదర్శకత లోపించిందనే విమర్శలు వినిపిస్తుండగా, ఈ వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా కూడా వేడెక్కుతోంది. ఆలయ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ట్రస్టు నుంచి వచ్చిన వివరణ అనేక వర్గాలను సంతృప్తిపరచలేకపోవడంతో వివాదం మరింత ముదురుతోంది. ఈ ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరపాలనే డిమాండ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ వివాదానికి సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ చేసిన ఆరోపణలే ప్రధాన కారణంగా మారాయి. సామాజిక మాధ్యమ వేదికలో ఆయన చేసిన వ్యాఖ్యల అనంతరం ఈ అంశం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ స్పందించారు. ట్రస్టు కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు అంతర్గత తనిఖీలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం కూడా అదే ప్రక్రియ కొనసాగుతోందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి అక్రమాలకు సంబంధించిన ఆధారాలు లభించలేదని కూడా స్పష్టం చేశారు. అయితే ట్రస్టు వివరణపై ప్రతిపక్షాలతో పాటు కాషాయ శిబిరంలోని కొందరు నాయకులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయోధ్యకు చెందిన దంత వైద్యుడు, భారతీయ జనతా పార్టీ నాయకుడు రజనీష్ సింగ్ ఈ వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. విరాళాల సేకరణ నుంచి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే వరకు మొత్తం ప్రక్రియపై ప్రత్యేక తనిఖీ నిర్వహించాలని ఆయన కోరారు. ట్రస్టు మౌనం ప్రజల్లో అనుమానాలను పెంచుతోందని, అందువల్ల నిజానిజాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంలో ట్రస్టుతో సంబంధం ఉన్న కొందరు మతపెద్దలు కూడా తమ సందేహాలను బహిరంగంగా వ్యక్తం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రస్టు అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్ దాస్ వారసుడిగా భావిస్తున్న కమల్ నయన్ దాస్ కూడా విచారణ జరగాలని అభిప్రాయపడ్డారు. అదే సమయంలో విచారణ నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యుల తీరుపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. దీంతో వివాదం కేవలం రాజకీయ పరిమితుల్లోనే కాకుండా ఆలయానికి సంబంధించిన వర్గాల్లోనూ చర్చకు కారణమైంది. ఇదే అంశంపై భారతీయ జనతా పార్టీ సభ్యుడు, అలహాబాద్ ఉన్నత న్యాయస్థాన న్యాయవాది మురళీధర్ సింగ్ కూడా ప్రధానమంత్రికి లేఖ రాశారు. విరాళాల దుర్వినియోగం, అపహరణ ఆరోపణలపై ఉన్నత స్థాయి కేంద్ర సంస్థతో నిష్పక్షపాత దర్యాప్తు జరపాలని ఆయన కోరారు. అలాగే భారత ప్రధాన లెక్కల పరిశీలన సంస్థ ద్వారా ప్రత్యేక తనిఖీ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి చర్యల ద్వారా మాత్రమే ప్రజల్లో నెలకొన్న అనుమానాలు తొలగిపోతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఆరోపణల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు ఈ బృందం ఏర్పాటైనట్లు అధికారులు వెల్లడించారు. లక్నో విభాగ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్, పోలీసు ఉన్నతాధికారి కిరణ్ ఎస్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి నీల్ రతన్ ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించనున్నట్లు సమాచారం. ఈ దర్యాప్తు ఫలితాలపై ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# 25 నుండి శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు

**పద్మసరోవరంలో భక్తులను అనుగ్రహించనున్న అలమేలుమంగ తల్లి**

**తిరుపతి, జూన్ 14 :** తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వార్షిక తెప్పోత్సవాలు జూన్ 25 నుండి 29వ తేదీ వరకు ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు పద్మసరోవరంలో సుందరంగా అలంకరించిన తెప్పలపై విహరిస్తూ శ్రీ అలమేలుమంగ తల్లి భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు. పాంచరాత్ర ఆగమ సంప్రదాయాల ప్రకారం నిర్వహించే ఈ మహోత్సవాల్లో పద్మసరోవర తీరాన అమ్మవారు విశేష పూజలను అందుకుని భక్తజనులను కటాక్షించనున్నారు. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు జరిగే ఈ తెప్పోత్సవాల్లో పాల్గొనడం ద్వారా భక్తుల కష్టాలు, సంసార బంధనలు తొలగి దైవానుగ్రహం, సర్వసౌఖ్యాలు సిద్ధిస్తాయని పురాణ ప్రాశస్త్యం. పద్మసరస్సులోని బంగారు పద్మం నుండి ఆవిర్భవించిన శ్రీ పద్మావతి అమ్మవారు జగజ్జననిగా భక్తులను భవసాగరంలో మునిగిపోకుండా రక్షించి మోక్షమార్గాన్ని ప్రసాదిస్తారనే ఆధ్యాత్మిక సందేశాన్ని తెప్పోత్సవాలు చాటిచెబుతాయి. జూన్ 25: రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివారి తెప్పోత్సవం, జూన్ 26: శ్రీ సుందరరాజస్వామివారి తెప్పోత్సవం, జూన్ 27 నుండి 29 వరకు: శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవం, చివరి మూడు రోజుల పాటు పద్మసరోవరంలోని నీరాడ మండపంలో మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. అలాగే జూన్ 28వ తేదీ రాత్రి 8.30 గంటలకు గజవాహన సేవ, జూన్ 29వ తేదీ రాత్రి 8.30 గంటలకు గరుడవాహన సేవ వైభవంగా జరుగనున్నాయి. తెప్పోత్సవం అనంతరం ప్రతిరోజూ ఆలయ మాడవీధుల్లో అమ్మవారి ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించనున్నారు. తెప్పోత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు అమ్మవారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, అలాగే జూన్ 26న జరిగే లక్ష్మీపూజలను రద్దు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంగీత కచేరీలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని పంచనున్నారు. అలమేలుమంగ తల్లి దివ్య కటాక్షం పొందేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని టీటీడీ కోరుతోంది.

# భారత్ అవకాశాలపై చర్చ

- నీస్‌లో కీలక సమావేశాలు
- పెట్టుబడిదారులతో మోదీ భేటీ
- ఆవిష్కరణలకు భారత్ కేంద్రం




**నీస్, జూన్ 14 :** ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో నిర్వహించిన 'భారత్ ఆవిష్కరిస్తోంది–2026' కార్యక్రమం సందర్భంగా జరిగిన చర్చలు ఎంతో ప్రయోజనకరంగా, జ్ఞానవంతంగా సాగాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు, వెంచర్ మూలధన సంస్థల ప్రతినిధులు, ఆవిష్కరణ రంగ నిపుణులతో ఆయన విస్తృతంగా చర్చలు జరిపారు. భారత్‌లో అందుబాటులో ఉన్న అపార అవకాశాలపై వారికి వివరించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశాలు భవిష్యత్తు భాగస్వామ్యాలకు బలమైన పునాది వేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమం సందర్భంగా పెట్టుబడిదారులు, వెంచర్ మూలధన రంగ ప్రముఖులతో ప్రధాని ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆవిష్కరణలు, సాంకేతిక రంగం, తయారీ పరిశ్రమ, అభివృద్ధి చెందుతున్న కొత్త రంగాల్లో భారత్ అందిస్తున్న అవకాశాలను వారికి వివరించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ వేగంగా ఎదుగుతున్న దేశంగా నిలుస్తోందని పేర్కొన్నారు. భారీ వినియోగదారుల మార్కెట్, యువశక్తి, అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాలు దేశానికి ప్రధాన బలాలుగా ఉన్నాయని వివరించారు. భారత్ అభివృద్ధి ప్రయాణం ప్రతిభ, విస్తృత స్థాయి, స్థిరత్వం, సంస్కరణలపై ఆధారపడి ఉందని మోదీ తెలిపారు. గత కొన్ని సంవత్సరాల్లో అమలు చేసిన పలు ఆర్థిక, పరిపాలనా సంస్కరణలు పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించాయని చెప్పారు. ప్రపంచంలోని అనేక సంస్థలు ఇప్పుడు భారత్‌ను విశ్వసనీయ భాగస్వామిగా చూస్తున్నాయని పేర్కొన్నారు. దీర్ఘకాలిక పెట్టుబడులకు భారత్ అత్యంత అనువైన గమ్యస్థానంగా మారిందన్నారు. ఆవిష్కరణల రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతిని కూడా ప్రధాని ప్రస్తావించారు. యువ పారిశ్రామికవేత్తలు, ప్రారంభ సంస్థలు ప్రపంచ స్థాయిలో తమ ప్రతిభను చాటుకుంటున్నాయని తెలిపారు. సాంకేతికత ఆధారిత పరిష్కారాలతో అనేక ప్రపంచ సమస్యలకు భారత యువత సమాధానాలు చూపుతోందని కొనియాడారు. దేశంలో ఏర్పడిన ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థ అంతర్జాతీయ సంస్థలను ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. తయారీ పరిశ్రమ, డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు, హరిత ఇంధన రంగాల్లో భారత్‌కు అపార అవకాశాలు ఉన్నాయని ప్రధాని వివరించారు. ఈ రంగాల్లో ప్రపంచ సంస్థలు, పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని ఆయన ఆహ్వానించారు. పరస్పర సహకారంతో ప్రపంచ స్థాయి పరిష్కారాలు అభివృద్ధి చేయవచ్చని అభిప్రాయపడ్డారు. పెట్టుబడులకు అనుకూల విధానాలు కొనసాగుతాయని కూడా హామీ ఇచ్చారు. ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా జరిగిన ఈ సమావేశాలు భారత్–ఫ్రాన్స్ ఆర్థిక సంబంధాలకు కొత్త ఊపునివ్వనున్నాయని భావిస్తున్నారు. పెట్టుబడులు, సాంకేతిక సహకారం, ఆవిష్కరణల రంగాల్లో మరింత భాగస్వామ్యం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తూ భారత్ వేగంగా ముందుకు సాగుతోందని, భవిష్యత్తులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలక పాత్ర పోషించనుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

# రాహుల్ విమర్శల దుమారం

**నావికుల మృతిపై ఆగ్రహం**

**కేంద్ర స్పందనపై ప్రశ్నలు**

**అమెరికాకు క్షమాపణ డిమాండ్**

**న్యూఢిల్లీ, జూన్ 14:** హర్మూజ్ జలసంధి ప్రాంతంలో ఇటీవల జరిగిన అమెరికా సైనిక చర్యల సందర్భంగా ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటన దేశ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు రేపుతోంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భారతీయుల ప్రాణాలు కోల్పోయినంత పెద్ద ఘటన జరిగినప్పటికీ కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదని ఆయన ఆరోపించారు. దేశ గౌరవానికి సంబంధించిన అంశంలో ప్రభుత్వం మరింత దృఢంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమ వేదికలో స్పందించిన రాహుల్ గాంధీ అమెరికా ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. ముగ్గురు భారతీయ నావికులు మరణించి రోజులు గడుస్తున్నప్పటికీ అమెరికా నుంచి కనీసం పశ్చాత్తాప ప్రకటన కూడా రాలేదని అన్నారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేయడంలోనూ అమెరికా విఫలమైందని విమర్శించారు. ఈ ఘటన అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యం కలిగిన అంశమైనప్పటికీ అమెరికా వ్యవహరించిన తీరు నిరాశ కలిగిస్తోందని పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చేసిన వ్యాఖ్యలపై కూడా రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అమెరికా సైన్యం ఆదేశాలను వెంటనే పాటించాలని, ఉల్లంఘనలను సహించబోమని చెప్పడం ఒక స్వతంత్ర దేశానికి ఆదేశాలు జారీ చేసినట్లుగా ఉందని అన్నారు. ప్రపంచంలో గౌరవప్రదమైన స్థానాన్ని కలిగి ఉన్న భారతదేశం ఇలాంటి వ్యాఖ్యలను సాధారణంగా తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం ఈ అంశాన్ని గట్టిగా ప్రస్తావించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై మౌనంగా ఉండటం దేశ ప్రజలను నిరాశకు గురి చేస్తోందని రాహుల్ గాంధీ విమర్శించారు. భారతీయుల ప్రాణాలు కోల్పోయినప్పుడు ప్రభుత్వం అమెరికా ముందు గట్టిగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ప్రయోజనాలు, భారతీయుల భద్రత, జాతీయ గౌరవం వంటి అంశాల విషయంలో రాజీపడే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ విషయంలో కేంద్రం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర నేతలు కూడా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా మాట్లాడుతూ అమెరికా ప్రభుత్వం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విదేశాంగ శాఖ స్పందన చాలా బలహీనంగా కనిపిస్తోందని అన్నారు. భారతీయుల ప్రాణనష్టం జరిగినప్పుడు కేవలం ఖండనతో సరిపెట్టకుండా స్పష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మరో కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ మాట్లాడుతూ అమెరికా అధికారుల వ్యాఖ్యలు బెదిరింపు ధోరణిలో ఉన్నాయని ఆరోపించారు. నావికుల మరణానికి బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి రావాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా ఈ అంశం దేశ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీయగా, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే తదుపరి స్పందనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



# ప్రాణాలు తీసిన వదంతి!

- రైలు నుంచి దూకిన ప్రయాణికులను ఢీకొట్టిన మరో రైలు
- నలుగురు మృతి.. పలువురికి తీవ్ర గాయాలు
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం

**భోపాల్, జూన్ 14:** మధ్యప్రదేశ్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. రైలులో మంటలు చెలరేగాయనే వదంతి నలుగురు ప్రాణాలను బలితీసుకుంది. భయంతో రైలు నుంచి దూకిన ప్రయాణికులను మరో రైలు ఢీకొనడంతో ఈ దారుణం జరిగింది. ప్రమాదంలో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఆదివారం సాయంత్రం ఉదయ్‌పూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ మోరేనా జిల్లాలోని హేతంపూర్ స్టేషన్ సమీపానికి చేరుకుంటున్న సమయంలో రైలులో మంటలు అంటుకున్నాయనే పుకారు వ్యాపించింది. దీంతో ఒక్కసారిగా ప్రయాణికుల్లో భయాందోళన నెలకొంది. ప్రాణాలు కాపాడుకునేందుకు పలువురు ప్రయాణికులు రైలు నుంచి కిందకు దూకి పట్టాలపైకి వెళ్లారు. అదే సమయంలో పక్క ట్రాక్‌పై వేగంగా వస్తున్న పాతాళ్‌లోక్ ఎక్స్‌ప్రెస్ పట్టాలపై ఉన్న ప్రయాణికులను ఢీకొట్టింది. రెప్పపాటులో జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు తీవ్రంగా గాయపడగా, వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, జిల్లా యంత్రాంగం వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని రక్షించి వైద్య చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై అధికారులు విచారణ ప్రారంభించారు. రైలులో మంటలు చెలరేగాయనే వదంతి ఎలా వ్యాపించింది, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రయాణికుల కథనం ప్రకారం, అకస్మాత్తుగా ఎవరో చైన్ లాగి మంటలు అంటుకున్నాయని కేకలు వేయడంతో ప్రయాణికులు భయపడి రైలు నుంచి దిగినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో మృతి చెందిన నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారిగా అధికారులు గుర్తించారు. భార్యాభర్తలతో పాటు వారి ఇద్దరు పిల్లలు కూడా ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకంగా మారింది. ఈ ఘటనతో మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



# ఒమన్ తీరంలో మునిగిన షిప్

**14 మంది భారతీయులకు తప్పిన ప్రమాదం**

**ఢిల్లీ:** ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న ఓడ ఇంజన్ వైఫల్యంతో మునిపోవడం ప్రారంభమైంది. సకాలంలో రెస్క్యూ చేయడంతో అందులో ఉన్న 14 మంది భారతీయుల్ని సురక్షితంగా కాపాడారు. అయితే, ఇదే ప్రాంతంలో జరిగిన మరో ప్రమాదంలో ఒక భారతీయ నావికుడు మరణించారు. జూన్ 14న మీూం విరాట్–1 అనే కార్గో షిప్ మునిగిపోయినట్లు మస్కట్‌లోని భారతీయ రాయబార కార్యాలయం వెల్లడించింది. ఈ ప్రమాదం ఒమన్‌లోని రాస్ అల్ హద్‌కు సుమారు 80 నాటికన్ మైళ్ల దూరంలో జరిగింది. ముందుగా పరిస్థితి తీవ్రంగా ఉండటంతో ఇండియన్ నేవీకి చెందిన నౌకలు సంఘటనా స్థలానికి వెళ్లాయి. అయితే, అమెరికన్ నేవీకి చెందిన పీ–8 సముద్ర నిఘా విమానం సంఘటన స్థలానికి చేరుకుని ఒక లైఫ్ రాఫ్ట్ జారవిడిచి, భారతీయ సిబ్బందిని రక్షించింది. ఓడలోని 14 మంది సిబ్బంది లైఫ్ రాఫ్ట్ సాయంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఎంవి జబల్ అలీ 9 నౌక కూడా సంఘటనా స్థలంలో సహాయక కార్యక్రమాల్లో పాలుపంచుకుంది. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఇదిలా ఉంటే మరో నౌకలో భారతీయ పౌరుడు నిశాంత్ ఉన్నానంతన్ మరణించారు. ఆరోగ్య కారణాల వల్ల మరణించినట్లు భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. అతడి మృతదేహం దుక్మ్ పోర్టులోని ఎంటీ సెలెస్టియన్ నౌకలో ఉంది. అతడి మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్ పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాయబార కార్యాలయం వెల్లడించింది.



# తెట్టెలపాడు-గోపాలపురం ఆర్&బీ రోడ్డు విస్తరణలో రైతు గోస

- ఇరువైపులా సమానంగా తీయండి..
- 'మా పొట్ట కొట్టొద్దు' అంటున్న బాధితుడు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:**

తిరుమలాయపాలెం: తెట్టెలపాడు గోపాలపురం ఆర్&బీ రోడ్డు విస్తరణ పనులు వివాదానికి దారితీశాయి. రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా సమానంగా భూమి తీసుకోకుండా, ఒకవైపే తీసుకుంటున్నారని తెట్టెలపాడు రైతు చిర్ర నాగయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

**గతంలోనూ భూమి కోల్పోయాం: రైతు**

"సర్వే నెంబర్ 126/అ/3లో 30 కుంటలు, 136/ఈ1/1లో 20 కుంటలు మాత్రమే మాకుంది. గతంలో కూడా ఇదే రోడ్డుకు 25 ఫీట్ల భూమి ఇచ్చాం. మళ్లీ ఇప్పుడు అదే వైపు రోడ్డు జరుపుతున్నారు. ఇరువైపులా సమానంగా తీస్తే అభ్యంతరం లేదు. కానీ మా వైపే మొత్తం తీస్తే మా జీవనాధారం పోతుంది" అని నాగయ్య వాపోయారు.

**అభ్యంతరం చెబితే బెదిరింపులు:**

అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, కానీ ఒకవైపు రైతులకే నష్టం కలిగేలా భూసేకరణ చేయడం అన్యాయమని బాధితులు అంటున్నారు. అభ్యంతరం వ్యక్తం చేస్తే అధికారులు బెదిరిస్తున్నారని ఆరోపించారు.వివరణ కోసం ఆర్&బీ డీఈ భగవాన్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. అందరికీ సమాన న్యాయం జరిగేలా అధికారులు

# విద్యా కేంద్రాలుగా వికసించాలి

**చదువుతోనే వర్గీకరణ ఫలాలు అందుతాయి**
**ఎమ్మార్పీఎస్ జాతీయ నేత వంగూరి ఆనందరావు మాదిగ**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్**

నేలకొండపల్లి, మాదిగ, మాదిగ ఉపకులాల పల్లెలు, బస్తీలు విద్యా కేంద్రాలుగా వికసించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు విద్యార్థుల తల్లిదండ్రు లు పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకులు వంగూరి ఆనందరావు మాదిగ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గువ్వలగూడెం గ్రామంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు 'గో టు విలేజ్' కార్యక్రమంలో భాగంగా గురువారం చదువులపై అవగాహన చైతన్య సదస్సు నిర్వహించారు. గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ అధినేత, సామాజిక ఉద్యమాల రథసారథి మహాజన నేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత అమలు కోసం భారతదేశ వ్యాప్తంగా మూడు దశాబ్దాలుగా అనేక పోరాటాలు, నిర్బంధాలను ఎదుర్కొని ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతను సాధించుకున్నాం. సాధించుకున్న ఆ వర్గీకరణ ఫలాలను మాదిగ, మాదిగ ఉపకులాల విద్యార్థినీ విద్యార్థులు అందుకోవాలి అంటే చదువు ఒక్కటే మార్గం. అది కేవలం చదువుతోనే సాధ్యమవుతుంది" అని స్పష్టం చేశారు. మాదిగ పల్లెల్లోని తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. "మన పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కావాలి. అప్పుడే మన బతుకులు మారతాయి. వర్గీకరణతో వచ్చిన రిజర్వేషన్లను మన పిల్లలే వినియోగించుకోవాలి" అని పిలుపునిచ్చారు. ఈ విద్యా అవగాహన సదస్సులో వంగూరి పెద్ద బంగారు మాదిగ, వంగూరి మహేష్ రావు మాదిగ, కొలకపొంగ వీరబాబు, కొత్తపల్లి ఏసు మాదిగ, సిద్దుల వీరభద్రం, మాతంగి శ్రీను మాదిగ, మాతంగి వెంకటేశ్వర్లు, కులగపొంగు సుందరయ్య, కొలకపొంగ బుచ్చమ్మ, కొలకపొంగు ఉమేష్, కోలకపొంగు ప్రవీణ్ పాల్గొన్నారు.

## 25% రిజర్వేషన్ ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదు

# పేద విద్యార్థుల రాజ్యాంగబద్ధ హక్కు

**ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:**

25% రిజర్వేషన్ అనేది ప్రభుత్వ దయా దాక్షిణ్యం కాదని, పేద విద్యార్థుల రాజ్యాంగ బద్ధ హక్కు అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ అన్నారు. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా బడులు ప్రారంభం కానున్న సందర్భంగా, ఆదివారం రోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ.....విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రయివేట్ పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల విద్యార్థులకు 25% సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. కానీ నేటికీ అనేక ప్రయివేట్ విద్యాసంస్థలు ఈ చట్టాన్ని బేఖాతరు చేస్తూ, వేలాది మంది పేద విద్యార్థులను నాణ్యమైన విద్యకు దూరం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో కూడా ఇప్పటివరకు 25% అమలుకు నోచుకోలేదన్నారు. ఈ హక్కును కాలరాస్తూ పేద పిల్లల భవిష్యత్తుతో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యం చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు విద్యాశాఖాధికారులు కూడా పట్టించుకునే పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈ విద్యా సంవత్సరం నుంచైనా పాలకులు, అధికారులు దీనిపై దృష్టి సారించి, కచ్చితంగా ప్రయివేటు బడుల్లో 25 % అమలుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు ప్రభుత్వం కూడా సహకరించి, పకడ్బందీగా అమలయ్యేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. చట్టాన్ని ఉల్లంఘిస్తున్న పాఠశాలపై కొరడా ఝులిపించాలని డిమాండ్ చేశారు.



## నేలకొండపల్లి మేజర్ పంచాయతీలో

# వర్షా కాలం ముందస్తు చర్యలు

- ముమ్మరంగా సాగుతున్న డ్రైనేజీల పనులు: సర్పంచ్, ఉప సర్పంచ్ పర్యవేక్షణ!
- ప్రధాన రహదారుల్లో ముమ్మరంగా పూడికతీత పనులు: సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి
- 7వ వార్డుపై ప్రత్యేక నజర్, వార్డు మెంబర్ ప్రత్యేక చొరవ!

**ఖమ్మం రాజముద్ర న్యూస్**

నేలకొండపల్లి:వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ముందస్తు వరద నివారణ చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. గతంలో కురిసిన భారీ వర్షాలకు స్థానిక పెట్రోల్ బంక్ నుండి గ్రామ పంచాయతీ కార్యాలయం ముందున్న సైడ్ డ్రైనేజీలు పూర్తిగా నిండిపోయి, వరద నీరంతా రోడ్ల మీదకు ప్రవహించేది. దీనికి తోడు డ్రైనేజీ లోతు తగ్గడంతో గత కొన్ని రోజులుగా పెట్రోల్ బంక్ పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిలిచిపోయి స్థానికులకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సర్పంచ్ శీలం వెంకట లక్ష్మి , ఉప సర్పంచ్ మద్దినేని మహేష్ ముందస్తు వ్యూహంతో రంగంలోకి స్వయంగా క్షేత్రస్థాయిలో ఉండి ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉంటే, ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వార్డుల్లోని డ్రైనేజీ సమస్యలపై కూడా పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా 7వ వార్డులో ఉన్న పలు చోట్ల ఓపెన్ డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి వార్డు సభ్యులు లింగంయలమంద ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారు. స్థానిక సీపీఎం ఆఫీస్ నుండి సింగారెడ్డి పాలెం స్కూల్ వరకు, అలాగే స్థానిక హైస్కూల్, చేపల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో వరద నీరు బయటకు రాకుండా జేసీబీల సహాయంతో కాల్వలను క్లియర్ చేయిస్తున్నారు. వర్షం పడినా మురుగునీరు సజావుగా సాగిపోయేలా వార్డుల్లో పనులను ముమ్మరం చేశారు. సమస్య వచ్చాక ఇబ్బంది పడటం కంటే, రాకముందే అప్రమత్తం కావడం మేలు అనే చొరవతో నేలకొండపల్లి గ్రామ పంచాయతీ పెద్దలు తీసుకుంటున్న ఈ ముందస్తు చర్యలపై స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వార్డుల్లో పనులు ముమ్మరంగా సాగుతుండటం, దానికి సర్పంచ్, ఉప సర్పంచ్‌ల పర్యవేక్షణ తోడవడంతో ఈసారి వర్షాకాలంలో ముంపు సమస్యలు తప్పుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

## నాణ్యమైన ఎరువులు, విత్తనాలు

# రైతులకు సబ్సిడీపై అందించాలి

**ఎ ఐ కె ఎం ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బజ్జూరి వెంకటరామిరెడ్డి డిమాండ్**




**ఖమ్మం, రాజముద్ర న్యూస్**

పాలేరు, కూసుమంచి మండలం: అఖిల భారత రైతు కూలీ సంఘం ఎ ఐ కె ఎం ఎస్ కూసుమంచి మండల మహాసభ శనివారం పాలేరు గ్రామం చాపల అప్పయ్య నగర్‌లో మాతంగి రామస్వామి అధ్యక్షతన ఘనంగా జరిగింది. తొలుత మాతంగి రామస్వామి సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం రైతు ఉద్యమ అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.ఈ సందర్భంగాఎ ఐ కె ఎం ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బజ్జూరి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, "కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు స్వామినాథన్ కమిషన్ సిఫారసు సి2+50% ప్రాతిపదికన మద్దతు ధర ఇచ్చి 2022 నాటికి రైతులను ధనికులను చేస్తామని చెప్పింది. కానీ ఆ మాటలు పచ్చి మోసం అని తేలిపోయింది" అని విమర్శించారు."రైతులను ముంచే మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి 750 మంది రైతులను బలి తీసుకుంది. హిందుత్వ ఫాసిజం ఒకపక్క, కార్పొరేట్ అనుకూల విధానాలతో డబుల్ ఇంజన్ సర్కారు ముందుకు పోతోంది. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పూర్తిగా తగ్గించి ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరలను విపరీతంగా పెంచింది. రైతులకు సరిపడా యూరియా ఇవ్వకుండా కేంద్రం నాటకాలు ఆడుతోంది" అని మండిపడ్డారు. "ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపోయిన తర్వాత యుద్ధం పేరు చెప్పి పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల రేట్లు పెంచడం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలి. కేంద్రం నిరుద్యోగుల కోసం నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడం అత్యంత బాధాకరం. బీజేపీ పాలనలో కార్పొరేట్లు బలపడి దేశాన్ని శాసించే స్థాయికి చేరాయి" అని ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వంపై కూడా విమర్శలు గుప్పించారు. "రాష్ట్రంలో రుణమాఫీ కాని రైతులు లక్షలాదిగా ఉన్నారు. వారి రుణాలను వెంటనే మాఫీ చేయాలి. పండిన పంటలు నెలలకొద్దీ మార్కెట్లో కాపలా కాయాల్సిన దుస్థితి నేలకొంది. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు రైతులకు సబ్సిడీపై అందించాలి" అని డిమాండ్ చేశారు.మహాసభలో నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సి పి ఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ కూసుమంచి సబ్ డివిజన్ కార్యదర్శి ఐ. వెంకన్న నూతన కమిటీని ప్రతిపాదించగా ఎఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు ఎం. గిరి వారితో ప్రతిజ్ఞ చేయించారు. నూతన కమిటీ అధ్యక్షులు మాతంగి రామస్వామి కార్యదర్శి చెరుకుపల్లి వీరయ్య సహాయ కార్యదర్శి చాపల సత్యనారాయణ ఉపాధ్యక్షులు నిమ్మల వెంకన్న ఈ కార్యక్రమంలో శీలం సుదర్శన్, గోపి రవి, కనకం గోపయ్య, కాంపాటి మధు, లింగ, చాపల రామయ్య, మదికుంట్ల సత్యం, చాపల కృష్ణయ్య, పి ఓ డబ్లు జిల్లా నాయకురాలు కే. కల్పన, మున్నా సుశీల, నాగమణి, హైమా, ఉమా, ఉప్పమ్మ తదితరులు పాల్గొన్నారు

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి

**బలవంతపు పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలపై చర్యలు తీసుకోవాలి**
**ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్**




**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:**

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ వస్తువులను బలవంతంగా విక్రయిస్తూ... తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆరోపించారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో అంబేద్కర్ భవన్లో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ....విద్యను వ్యాపారంగా మార్చి ఇష్టానుసారంగా ఫీజులు పెంచడం బాధాకరమన్నారు. విద్యార్థులు పాఠశాలల వద్ద నుంచే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తేవడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అధిక ఫీజులు వసూలు చేస్తూ... పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలను బలవంతం చేస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి చరణ్ గౌడ్, మాల చందు, డివిజన్ ఉపాధ్యక్షులు మణికంఠ, డివిజన్ నాయకులు వినోద్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు

## అంబేద్కరే లేకుంటే మేము ఏమైపోతుంటిమో..


**కాలనీ డెవలప్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతరాజు రాములు**



**కీసర, రాజముద్ర న్యూస్:** కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రతి ఆదివారం జ్ఞానమాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు 223వ జ్ఞానమాల, మహాత్మ జ్యోతిరావు పూలేకు 23వ జ్ఞాన మాల కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఆర్జికే కాలనీ డెవలప్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతరాజు రాములు నీ ఆహ్వానించారు. మహానుభావులకు జ్ఞానమాల సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన సేవలు భారతదేశానికి అనేకమని మహిళలకు చట్టసభల్లో ప్రాధాన్యతనిచ్చే చట్టాలు తేవడం, వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడం, జనాభా ప్రతిపాదికన బీసీ వర్గానికి 42 శాతం రిజర్వేషన్ కల్పించుకునే అవకాశం, ఇలా అనేక చట్టాలను భారత రాజ్యాంగంలో బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పొందు పరిచారని కొనియాడారు. బీద వర్గాల ప్రజలకు ఓటు హక్కు కల్పించిన మహోన్నతుడని,బాబాసాహెబ్ భారత రాజ్యాంగంలో మానవాళికే కాకుండా అనంత కోటికి ఆయన ప్రాధాన్యత కల్పించారని అన్నారు. జ్ఞానం కావాలి అంటే అందరూ చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేత, జాతీయ మాల మహానాడు మేడ్చల్ జిల్లా కన్వీనర్, సంఘం గౌరవ అధ్యక్షులు గుజ్జుక పరుశురాం, ముదిరాజు సంఘం అధ్యక్షుడు ఈగ రాజు, ముఖ్య సలహాదారులు అబ్బులు,కోశాధికారి పాడుగుల రూప, సలహాదారులు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు సానాది సాయిబాబా, సంఘ పెద్దలు చంద్రమౌళి, ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, కనకయ్య, వెంకటేష్ , అప్పారావు, రమణ, యువ నాయకులు రాధాక్రిష్ణ , సభ్యులు జయమయ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# టెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

**తెలంగాణ బ్యూరో:**



టీజీ టెట్ జూన్ 2026 పరీక్షలు రేపటి నుండి ప్రారంభం కానున్నాయి. జూన్ 16 నుండి జూన్ 22 వరకు మొత్తం 5 రోజుల పాటు పది సెషన్లలో ఆన్‌లైన్ పద్ధతిలో ఈ పరీక్షలు జరుగనున్నాయి. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో ఏర్పాటు చేసిన 61 కేంద్రాలలో మొత్తం 10 సెషన్లుగా ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. అభ్యర్థులు పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ https://schooledu.telangana.gov.in ను సంప్రదించవచ్చు.

# వ్యక్తి అదృశ్యం పై కేసు నమోదు

**రామారెడ్డి రాజముద్ర న్యూస్**



ఉప్పల్వాయి గ్రామానికి చెందిన జంగిటి లక్ష్మి తన భర్త జంగిటి నారాయణ అందాజా రెండు నెలల క్రితం ఇంట్లో నుండి వెళ్లిపోయినాడు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతకగా నారాయణ ఆచూకీ లభించలేదు అని నారాయణ భార్య జంగిటి లక్ష్మి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామారెడ్డి ఎస్ఐ పి. రాజశేఖర్ తెలిపినారు.

## కీసర అంబేద్కర్ సంఘం
# యధావిధిగా కొనసాగుతుంది



**కీసర, రాజముద్ర న్యూస్:**

కీసర మండల అంబేద్కర్ సంఘం ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం కీసర పెద్దమ్మ ఆలయం వద్ద నిర్వహించారు. ఆదివారం కీసర మండల సంఘం సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో అనేక అంశాలపై కులంకుషంగా చర్చించడం జరిగింది. ప్రధానంగా కీసర మండల అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు చినింగిని కృష్ణ, శీలం శ్రీనివాస్, తుడుం యాదగిరి, మంచాల రాజలింగం, శీలం మల్లేష్, చినింగని బాల్ రాజ్, బంటు శ్రీనివాస్, కుంటోళ్ల వెంకటేష్, కుంటోళ్ల బాల్ రాజ్ పలువురు నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి ఆశయాలను సాధించాల్సిన భాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. కీసర మండల అంబేద్కర్ సంఘంపై ఎలాంటి ఆదారాలు లేకుండా కేవలం వ్యక్తిగత కక్ష, స్వలాభం కోసమే కొందరు మండలానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆరోపణలు, నిందలు వేస్తున్నట్లు అర్ధం అవుతుందన్నారు. మండల కమిటిలో ఏమైన వ్యత్యాసాలు ఉంటే సానుకుల చర్చలతో ముందుకు పోతే సంఘం గౌరవంగా ఉంటుంది. కానీ అనవసర గోడవలకు అవకాశం ఇచ్చేవిధంగా మండల అడక్ కమిటి అంటూ ఏర్పాటు చేయడమెంటని ప్రశ్నించారు. మహనీముడిపై ముత్రం పోసిన అంశలపై ప్రతిసారి సోషల్ మీడియాలో పెడుతూ అనవసర ప్రచారం చేయడం మానుకోవాలని మండల సీనియర్ అంబేద్కర్ సంఘం తీర్మానం చేశారు. అడక్ కమిటికి, కీసర మండల అంబేద్కర్ సంఘంనకు ఎలాంటి సంబంధం లేదని కీసర మండలం అంబేద్కర్ సంఘం ఏదావిధిగా కోనసాగుతుందని మండల అంబేద్కర్ సంఘం నాయకులుగా స్పష్టం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్, ఉపాధ్యక్షుడు గోరంటి ప్రవీణ్, కోశాధికారి రొండ్ల మహేష్, సంయుక్త కార్యదర్శిలు మంచాల మహేష్, తాళ్ళ కిరణ్, కుర్రి పరమేష్, ఎంకిరాల నర్సింగ్, సంఘం నాయకులు పుంద్రు రాకేష్, మొరుగు క్రాంతి కుమార్, పట్టా మహేందర్ పలువురు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా మెగా జాబ్ మేళా

**ఈనెల 19న గాంధీభవన్‌లో 100 కంపెనీలతో ఉద్యోగ మేళా**
**నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: అనిల్ కుమార్ యాదవ్**




**హైదరాబాద్, జూన్ 14:**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా ఈ నెల 19న గాంధీభవన్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. ఆదివారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ మేళాలో 100కు పైగా సంస్థలు పాల్గొంటున్నాయని చెప్పారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లక్ష మందికి పైగా వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించిందని తెలిపారు. యువత ఉపాధి, విద్యా హక్కుల కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆడుకుంటోందని, పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, ప్రశ్నాపత్రాల లీకేజీల వల్ల యువత భవిష్యత్ దెబ్బతింటోందని విమర్శించారు. ఈ అంశాలపై రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఉద్యమం చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్రమోదీ, ఉన్న ఉద్యోగాలనే కోల్పోయే పరిస్థితి తీసుకొచ్చారని ఆరోపించారు. 12 ఏళ్ల పాలనలో దేశానికి ఏమి చేశారో బీజేపీ నాయకులు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఇందిరాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు పేర్లు మార్చి తమ ఘనతగా చెప్పుకుంటున్నారని మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ నాయకత్వంపై కూడా అనిల్ కుమార్ యాదవ్ విమర్శలు చేశారు. ఆ పార్టీలో కుటుంబ రాజకీయాలు కొనసాగుతున్నాయని, వెన్నుపోటు రాజకీయాలు ఎవరు చేస్తున్నారో ప్రజలకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు




# ఘనంగా లక్ష్మారెడ్డి కాలనీ కమాన్ ప్రారంభోత్సవం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొత్త కిషోర్ గౌడ్**
**కమాన్ దాత బొబ్బల లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు**

**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని లక్ష్మారెడ్డి కాలనీలో కమాన్ దాత బోడుప్పల్ బంగారు మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మారెడ్డి కాలనీ కమాన్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ పాల్గొని కాలనీ ముఖ:ద్వారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్త కిషోర్ గౌడ్ మాట్లాడుతూ బొబ్బల లక్ష్మారెడ్డి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, లక్ష్మారెడ్డి కాలనీ వాసుల కోరిక మేరకు కాలనీ ముఖద్వారం తన సొంత నిధులతో ఏర్పాటు చేయడం సంతోషకరమని, భవిష్యత్తులో కూడా లక్ష్మారెడ్డి తన సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం లక్ష్మారెడ్డి కాలనీ అసోసియేషన్ సభ్యులు బొబ్బల లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పస్తం లోకేష్, లక్ష్మారెడ్డి , మహేందర్ రెడ్డి, జంగారెడ్డి, సిగురు రవికుమార్ ,గుండువెల్లి రాజు, బోడుప్పల్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప, పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవేందర్, లక్ష్మారెడ్డికాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి, జనరల్ సెక్రెటరీ వెంకటేష్, కార్యవర్గ సభ్యులు, సూరజ్ నగర్, బాలాజీ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.








# కనెక్టెడ్ సమ్మర్ కప్‌లో సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:**

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌కు చెందిన ప్రిన్స్ అకాడమీ విద్యార్థులు కనెక్టెడ్ సమ్మర్ కప్ టోర్నమెంట్‌లో విశేష ప్రతిభ కనబరిచారు. అత్యుత్తమ విజయాలతో అకాడమీకి గర్వకారణంగా నిలిచారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. అండర్–15 విభాగంలో రేశ్వంత్ తన అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకుని, టోర్నమెంట్‌లో ఉత్తమ బౌలర్ అవార్డును సొంతం చేసుకున్నాడు. అండర్–12 విభాగంలో యజుష్ బాబు కొండ తన నైపుణ్యం, స్థిరమైన క్రీడాస్ఫూర్తితో మెప్పించి, ఉత్తమ బౌలర్ అవార్డును అందుకున్నాడు.విద్యార్థుల సాధించిన ఈ విజయం పాఠశాల ప్రతిష్టను మరింతగా పెంచాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.




# ఎల్‌నినో ప్రభావానికి ముందస్తు కార్యాచరణ

- ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం
- 87.49 లక్షల క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం
- రైతులకు వాతావరణ సమాచారం వాట్సాప్ ద్వారా

**హైదరాబాద్, జూన్ 15:**

రాష్ట్రంలోని రైతులు వరి పంటపై మాత్రమే ఆధారపడకుండా కందులు, పెసలు, మినుములు, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న, నువ్వులు, ఆముదం వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి, విత్తనాల కొరత తలెత్తకుండా 87.49 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. కందులు, జొన్నలు, మొక్కజొన్న, సజ్జలు వంటి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను జిల్లాల్లో ముందుగానే నిల్వ చేసినట్లు చెప్పారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ఏప్రిల్ నెలలోనే వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వాతావరణ శాఖ నిపుణులతో సమావేశాలు నిర్వహించి ముందస్తు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. వర్షాలు ఆలస్యమైనా లేదా తక్కువగా కురిసినా రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ సాగు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.



**ఎరువుల బుకింగ్ యాప్‌లో కొత్త సదుపాయాలు**

రబీ సీజన్‌లో రైతుల నుంచి వచ్చిన సూచనల ఆధారంగా రాష్ట్ర ఎరువుల బుకింగ్ యాప్‌లో పలు మెరుగుదలలు చేసినట్లు మంత్రి తెలిపారు. జిల్లాల వారీగా డీలర్ల నిల్వలు, మండల మ్యాపింగ్ సదుపాయాలతో పాటు మీ సేవ కేంద్రాల ద్వారా కూడా ఎరువుల బుకింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. యాప్ వినియోగంతో ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద రద్దీ తగ్గి పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా మారుతుందని వివరించారు. జూలై, ఆగస్టు నెలల్లో ఎల్‌ని నో ప్రభావం కనిపించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో పంటల ప్రణాళిక, విత్తనాలు, ఎరువుల లభ్యత, రైతులకు సాంకేతిక సూచనలపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు వెల్లడించారు. రైతులు స్థానిక వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని మంత్రి కోరారు.

**వాతావరణ సమాచారం నేరుగా రైతుల ఫోన్లకు**

రైతులకు ఖచ్చితమైన, సమయానుకూలమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు "తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం" అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మండలాల వారీగా వర్షపాతం, ఉష్ణోగ్రతలు, గాలి వేగం తదితర వివరాలను వాట్సాప్ సందేశాల రూపంలో రైతులకు పంపిస్తున్నట్లు చెప్పారు. విత్తనాలు వేయడం, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, పంట సంరక్షణ వంటి అంశాల్లో రైతులు సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఈ సమాచారం ఉపయోగపడుతోందన్నారు. ఇప్పటివరకు 18 జిల్లాల్లో 28 లక్షల మందికి పైగా రైతులకు వాతావరణ సమాచార సందేశాలు పంపించినట్లు తెలిపారు. 71 శాతం డెలివరీ రేటుతో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, పంట నష్టాలను తగ్గించడం లక్ష్యంగా సాంకేతిక ఆధారిత సేవలను మరింత విస్తరించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# పోలీసు శాఖలో అవినీతి పెరిగిపోయింది

**మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకళ్ల జగదీశ్వర్ రెడ్డి**

**, యాదాద్రి భువనగిరి, జూన్ 14:**

పోలీసు శాఖలో అవినీతి పెరిగిపోయిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకళ్ల జగదీశ్వర్ రెడ్డి ఆరోపించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కార్యకర్తల కనుసనులలో మెదులుతున్నారని, అవినీతి ఇష్టారాజ్యంగా మారిపోవడంతో సామాన్య ప్రజలు మరోసారి మోసపోయారని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఎస్ ఐ ఆర్ పై పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్యలు, మానభంగాలు మళ్లీ దొంగతనాలు పెరిగిపోయి 2014 పూర్వం రోజులు రాష్ట్రంలో నెలకొన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటికీ ధాన్యం కొనుగోలు పూర్తి కాలేదని రైతులకు ధాన్యం దళారుల పాలు చేసి అన్యాయం చేశారని ధ్వజమెత్తారు., రైస్ మిల్లుల యజమాలు నుంచి కోట్లాది రూపాయలు దండుకున్నారని, అవినీతి కోట్ల రూపాయల సంపాదన మార్గంగా ఎంచుకున్నారని అన్నారు. కనీస మద్దతు ధర అందలేదని అంతేకాకుండా ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ రైతుల సమస్యలగురించి పట్టించుకోలేదని రైతాంగ సమస్యల పట్ల రివ్యూనిర్వహించలేదని మండిపడ్డారు. కెసిఆర్ దేశంలోనే అద్భుతంగా తీర్చిదిన్న వ్యవసాయ రంగానికి నేడు ఎన్నికల ముందే పథకాలు అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు సీఎం జిల్లాకు వస్తున్నారంటే అభివృద్ధి సంక్షేమ పథకాల హామీలు ఎందరికో ప్రయోజనం చేయకురేవని నేడు ముఖ్యమంత్రి జిల్లాకు వస్తున్నారు అంటే బూతులు తప్ప మరోటి లేదని, హమ్ రోడ్లు కావవి స్కాం రోడ్ లని కాంట్రాక్టర్లను బ్రతికించి డబ్బులు దండుకోవడం కోసం అని విమర్శించారు. చివరికి పల్లెటూరుల లో కూడా టోల్ గేట్లు విధించే ప్రభుత్వమని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో మాజీఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి,పార్లమెంట్ ఇన్చార్జి క్యామ మల్లేశం, మాజీ జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, సుబ్బూర్ బీరు మల్లయ్య, ఏ వి కిరణ్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, కేశవపట్నం రమేష్, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






# 53 ఏళ్ల నిరీక్షణకు తెర

## న్యూయార్క్ జట్టుకు విజేత కిరీటం

**న్యూయార్క్, జూన్ 14 :** బాస్కెట్‌బాల్ చరిత్రలో న్యూయార్క్ జట్టు సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఏకంగా 53 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలుకుతూ జాతీయ బాస్కెట్‌బాల్ పోటీల కొత్త విజేతగా అవతరించింది. తుదిపోరులో సాన్ ఆంటోనియో జట్టును 4-1 తేడాతో ఓడించి ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో న్యూయార్క్ జట్టు తమ చరిత్రలో మూడోసారి విజేత కిరీటాన్ని సొంతం చేసుకుంది. చివరిసారిగా 1973లో ఈ ఘనతను అందుకున్న జట్టు, మళ్లీ ఐదు దశాబ్దాల తర్వాత ట్రోఫీని ముద్దాడటంతో ఆటగాళ్లు, అభిమానులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. తుదిపోటీ మొత్తం న్యూయార్క్ జట్టు ఆధిపత్యం ప్రదర్శించింది. ఆరంభం నుంచే ప్రత్యర్థిపై పైచేయి సాధించిన జట్టు సమష్టి కృషితో అద్భుత ప్రదర్శన కనబరిచింది. కీలక సందర్భాల్లో ఆటగాళ్లు రాణించడంతో సాన్ ఆంటోనియో జట్టుకు తిరిగి పుంజుకునే అవకాశం లేకుండా పోయింది. దీర్ఘకాలంగా టైటిల్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఈ విజయం మరపురాని కానుకగా నిలిచింది. విజయం ఖరారైన వెంటనే మైదానంలో సంబరాలు అంబరాన్నంటగా, జట్టు చరిత్రలో ఈ ఘట్టం చిరస్మరణీయంగా నిలిచిపోయింది.



# టర్కీపై ఆస్ట్రేలియా ఘన విజయం

**వాంకోవర్, జూన్ 14:** ప్రపంచ ఫుట్‌బాల్ మహాసంగ్రామంలో ఆస్ట్రేలియా జట్టు విజయంతో శుభారంభం చేసింది. గ్రూప్-డి తొలి మ్యాచ్‌లో టర్కీ జట్టుపై 2-0 తేడాతో విజయం సాధించి టోర్నీని ఉత్సాహంగా ఆరంభించింది. మ్యాచ్ ప్రారంభం నుంచి దూకుడుగా ఆడిన ఆస్ట్రేలియా జట్టుకు 27వ నిమిషంలో యువ ఫార్వర్డ్ నెస్టోరీ ఇరాన్‌కుందా తొలి గోల్ అందించాడు. వేగవంతమైన ఎదురుదాడిలో అతడు చేసిన అద్భుత గోల్ జట్టుకు ఆధిక్యాన్ని తీసుకొచ్చింది. ఈ గోల్‌తో ఆస్ట్రేలియా తరఫున ప్రపంచకప్‌లో గోల్ చేసిన అతి పిన్న వయస్కుడిగా ఇరాన్‌కుందా రికార్డు నెలకొల్పాడు. ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియాను ఒత్తిడికి గురిచేయాలని టర్కీ ప్రయత్నించినప్పటికీ, ప్రత్యర్థి రక్షణశ్రేణిని ఛేదించలేకపోయింది. కీలక సమయంలో ఆస్ట్రేలియా ఆటగాళ్లు సమర్థవంతంగా రక్షణను నిర్వహించారు. 75వ నిమిషంలో కానర్ మెట్‌కాఫ్ బాక్స్ వెలుపల నుంచి కొట్టిన అద్భుత షాట్ నేరుగా గోల్‌పోస్ట్‌లోకి వెళ్లడంతో ఆస్ట్రేలియా ఆధిక్యం 2-0కు పెరిగింది. దీంతో మ్యాచ్ ఫలితం దాదాపు ఖరారైంది. ఆస్ట్రేలియా యువ గోల్‌కీపర్ పాట్రిక్ బీచ్ మ్యాచ్‌లో విశేషంగా రాణించాడు. టర్కీ చేసిన పలు ప్రమాదకర ప్రయత్నాలను అడ్డుకుని జట్టు విజయానికి కీలకంగా మారాడు. ఈ విజయంతో ఆస్ట్రేలియా మూడు పాయింట్లు ఖాతాలో వేసుకుని గ్రూప్-డి పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. మరో మ్యాచ్‌లో పరాగ్వేపై 4-1 తేడాతో విజయం సాధించిన అమెరికా జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది.



# గిల్ పేరిట రికార్డు

**లక్నో, జూన్ 14 :** భారత యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వన్డే క్రికెట్‌లో మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన తొలి వన్డేలో అద్భుత ఇన్నింగ్స్ ఆడి జట్టుకు విజయాన్ని అందించడమే కాకుండా, అత్యంత వేగంగా 3,000 వన్డే పరుగులు పూర్తి చేసిన భారత బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. గిల్ కేవలం 62 ఇన్నింగ్స్‌ల్లోనే 3,000 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఇంతకుముందు ఈ రికార్డు శిఖర్ ధావన్ (72 ఇన్నింగ్స్‌లు), విరాట్ కోహ్లీ (75 ఇన్నింగ్స్‌లు) పేరిట ఉండగా, ఇప్పుడు గిల్ వారిని అధిగమించాడు. ప్రపంచ స్థాయిలో చూస్తే దక్షిణాఫ్రికా మాజీ బ్యాటర్ హాషీమ్ ఆమ్లా 57 ఇన్నింగ్స్‌లతో తొలి స్థానంలో కొనసాగుతున్నాడు. వర్షం కారణంగా 25 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్ జట్టు 194 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ గుర్బాజ్ 51 బంతుల్లో 102 పరుగులు చేసి అద్భుత సెంచరీ నమోదు చేశాడు. 195 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు కెప్టెన్ గిల్ ముందుండి నడిపించాడు. 66 బంతుల్లో 84 పరుగులతో అజేయంగా నిలిచిన అతడు జట్టు విజయానికి పునాది వేశాడు. అతనికి తోడుగా లోకేశ్ రాహుల్ 19 బంతుల్లో 39 పరుగులు చేసి రాణించాడు. దీంతో భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రెండో వన్డే బుధవారం లక్నోలో, చివరి వన్డే జూన్ 20న చెన్నైలో జరగనుంది.

# ఆర్చరీ ప్రపంచకప్‌లో భారత్‌కు స్వర్ణ పతకం



**న్యూయార్క్, జూన్ 14:** తుర్కియే వేదికగా జరిగిన ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-3 పోటీల్లో భారత్ చరిత్ర సృష్టించింది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత జోడీ ధీరజ్ బొమ్మదేవర-- కుంకుమ్ మొహోద్ అద్భుత ప్రదర్శనతో ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్ దక్షిణ కొరియాను 5-1 తేడాతో ఓడించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన ఓహ్ యే-జిన్, కిమ్ జె-డివోక్ జోడీని భారత ద్వయం వరుస సెట్లలో ఆధిపత్యంగా ఎదుర్కొంది. తొలి సెట్ నుంచే దూకుడుగా ఆడిన భారత్ 37-36, 37-36 స్కోర్లతో మొదటి రెండు రౌండ్లను గెలుచుకుని ఆధిక్యం సాధించింది. మూడో రౌండ్ 39-39తో సమంగా ముగిసినా, మొత్తం పాయింట్ల ఆధారంగా భారత్ విజేతగా నిలిచింది. మ్యాచ్ చివరి దశలో ధీరజ్ బొమ్మదేవర వరుసగా రెండు పర్ఫెక్ట్ 10లు కొట్టడం మ్యాచ్‌కు కీలక మలుపుగా మారింది. అతని అద్భుత గురితప్పని షాట్లు దక్షిణ కొరియా జట్టుకు అవకాశమే ఇవ్వకుండా భారత్‌కు స్వర్ణ పతకాన్ని ఖాయం చేశాయి. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్‌కు ఇది నాలుగేళ్ల తర్వాత వచ్చిన ప్రపంచకప్ స్వర్ణం. చివరిసారిగా 2022లో రిధి ఫోర్, తరుణ్‌దీప్ రాయ్ జోడీ ఈ ఘనత సాధించింది. ధీరజ్ బొమ్మదేవర, కుంకుమ్ మొహోద్ జోడీకి ప్రపంచకప్ స్థాయిలో ఇది తొలి స్వర్ణ పతకం కావడం విశేషం. ప్రస్తుతం భారత అగ్రశ్రేణి ఆర్చర్‌గా కొనసాగుతున్న ధీరజ్ వ్యక్తిగత విభాగంలో కూడా పతక రేసులో ఉన్నాడు. మరోవైపు కేవలం 17 ఏళ్ల వయసులోనే కుంకుమ్ మొహోద్ అంతర్జాతీయ వేదికపై మరోసారి తన ప్రతిభను చాటుకుంది. ఈ ఏడాది షాంఘై ప్రపంచకప్ స్టేజ్-2లో భారత మహిళల రికర్వ్ జట్టుతో కలిసి ఆమె ఇప్పటికే స్వర్ణ పతకం గెలిచింది. ఈ విజయంతో ప్రపంచ ఆర్చరీలో భారత్ తన సత్తా మరోసారి చాటగా, రాబోయే అంతర్జాతీయ టోర్నమెంట్లకు భారత జట్టులో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది.

# గంభీర్ సూచనలే నా సెంచరీకి కారణం..

## గుర్బాజ్ ఆసక్తికర వ్యాఖ్యలు

**ధర్మశాల, జూన్ 14:** భారత్‌తో జరిగిన తొలి వన్డేలో అద్భుత శతకంతో మెరిసిన ఆఫ్ఘనిస్థాన్ ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ తన విజయానికి టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఇచ్చిన సూచనలే ప్రధాన కారణమని వెల్లడించాడు. వ్యక్తిగతంగా తన ఆటతీరు మెరుగుపడటానికి గంభీర్ సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపాడు. వర్షం కారణంగా 25 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో గుర్బాజ్ కేవలం 51 బంతుల్లోనే 102 పరుగులు చేసి ఆఫ్ఘనిస్థాన్‌కు భారీ స్కోరు అందించాడు. అయితే జట్టు ఓటమి చెందడంతో తన సెంచరీ పూర్తిగా సంతృప్తి ఇవ్వలేదని పేర్కొన్నాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ.. "ఇలాంటి ఇన్నింగ్స్ ఆడినందుకు సంతోషంగా ఉంది. నా ఆటతీరును మెరుగుపర్చుకోవడానికి చాలా కష్టపడ్డాను. అయితే ఈ ఇన్నింగ్స్‌కు అసలు క్రెడిట్ గంభీర్ సర్‌కే చెందుతుంది. ఇటీవల టెస్టు మ్యాచ్ ముగిసిన తర్వాత ఆయనతో చాలాసేపు మాట్లాడాను. షాట్ల ఎంపిక, పరిస్థితులకు తగ్గట్టు బ్యాటింగ్ చేయడం గురించి విలువైన సూచనలు ఇచ్చారు. నెట్స్‌లో వాటినే సాధన చేశాను. ఇప్పుడు దానికి ఫలితం కనిపించింది" అని గుర్బాజ్ తెలిపాడు. పిచ్ పరిస్థితుల గురించి మాట్లాడుతూ.. "ధర్మశాల పిచ్‌పై స్పిన్‌ను ఎదుర్కోవడం అంత సులభం కాదు. స్పిన్నర్లకు మంచి సహకారం లభించింది. అయినప్పటికీ నేను సానుకూల దృక్పథంతో బ్యాటింగ్ చేశాను. సెంచరీ సాధించడం ఆనందంగా ఉన్నా, జట్టు ఓడిపోవడం బాధ కలిగించింది" అని చెప్పాడు. కాగా, గుర్బాజ్ విధ్వంసకర సెంచరీతో ఆఫ్ఘనిస్థాన్ 25 ఓవర్లలో 194 పరుగులు చేసింది. అనంతరం భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుత అర్ధశతకంతో చెలరేగడంతో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది.



# అమ్మ ఫోన్‌కు వెంటనే స్పందించిన నితీశ్..



**ధర్మశాల, జూన్ 14 :** భారత యువ ఆల్‌రౌండర్, తెలుగు తేజం నితీశ్‌కుమార్ రెడ్డి మరోసారి తన సంస్కారం, వినయంతో అభిమానుల మనసులు గెలుచుకున్నాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన తొలి వన్డే అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో చోటుచేసుకున్న ఓ చిన్న ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భారత్ విజయం అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నితీశ్‌కు విలేకరులు ప్రశ్నలు అడుగుతున్న సమయంలో ఆయన మొబైల్ ఫోన్ మోగింది. ఫోన్ స్క్రీన్‌పై 'అమ్మ' అని కనిపించగానే, నితీశ్ కాసేపు మీడియా ప్రతినిధులకు క్షమాపణలు చెప్పి కాల్ అందుకున్నాడు. "అమ్మా.. నేను మళ్లీ చేస్తాను.. ఫైవ్ మినిట్స్" అంటూ తెలుగులో ఎంతో మర్యాదగా సమాధానం ఇచ్చి ఫోన్ పెట్టేశాడు. అనంతరం చిరునవ్వుతో మళ్లీ మీడియా సమావేశాన్ని కొనసాగించాడు. ఈ హృద్యమైన ఘటనకు సంబంధించిన వీడియోను బీసీసీఐ తమ అధికారిక సోషల్ మీడియా వేదికల్లో పంచుకోవడంతో అది క్షణాల్లో వైరల్ అయింది. అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్నప్పటికీ తల్లిదండ్రుల పట్ల నితీశ్ చూపుతున్న గౌరవం, సంస్కారం నెటిజన్లను ఆకట్టుకుంది. "మైదానంలో ప్రతిభతో మెప్పిస్తున్నాడు.. మైదానం బయట సంస్కారంతో గెలుస్తున్నాడు", "తెలుగు కుర్రాడి వినయం గొప్పది", "ఇదే నిజమైన స్టార్ లక్షణం" అంటూ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా, ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో నితీశ్‌కుమార్ రెడ్డి కీలకమైన వికెట్ సాధించి భారత విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. గాయపడిన హార్దిక్ పాండ్యా స్థానంలో జట్టులోకి వచ్చిన ఈ యువ ఆల్‌రౌండర్, బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ ఆకట్టుకుంటూ భవిష్యత్ స్టార్‌గా ఎదుగుతున్నాడు.



## అందం అభినయం ఉన్న అవకాశాలు మాత్రం లేవు..

అందం, అభినయం ఉండి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న భామల్లో రెజీనా కాసాంద్రా ఒకరు. తమిళ, తెలుగు, కన్నడ భాషల్లో నటించిన ఈ అమ్మడు ఇప్పటికీ సారైనా అవకాశం కోసం ఎదురుచూస్తుంది. తెలుగులో నటించిన శివ మనసులో శృతి సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ. అందం, అభినయం ఉండి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న భామల్లో రెజీనా కాసాంద్రా ఒకరు. తమిళ, తెలుగు, కన్నడ భాషల్లో నటించిన ఈ అమ్మడు ఇప్పటికీ సారైనా అవకాశం కోసం ఎదురుచూస్తుంది. తెలుగులో నటించిన శివ మనసులో శృతి సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ. ఈ సినిమాలో తన నటనతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది జీనా కాసాంద్రా. శివ మనసులో శృతి సినిమా తర్వాత రొటీన్ లవ్ స్టోరీ , కొత్త జంట సినిమాల్లో నటించిన పాత్రల ద్వారా గుర్తింపు పొందింది. తెలుగులో చివరిగా ఉత్సవం అనే సినిమాలో నటించింది ఆ తర్వాత పెద్దగా ఎక్కడా కనిపించలేదు. రెజీనా కసాంద్రా.. ఈ అమ్మడి గురించి ప్రత్యేకంగాపరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈ అందాల భామ తన గ్లామర్ తో పాటు నటన పరంగానూ మెప్పిస్తుంది. తాజాగా రెజీనా కసాంద్రా ముస్లిం కుటుంబంలో పుట్టి క్రైస్తవ మతాన్ని స్వీకరించడానికి గల కారణాన్ని వెల్లడించింది. నటి రెజీనా కసాంద్రా 1990 డిసెంబర్ 13న చెన్నైలో జన్మించింది. 9 సంవత్సరాల వయస్సులో, ఆమె పిల్లల టీవీ ఛానెల్ లో యాంకర్‌గా తన కెరీర్ ప్రారంభించింది. ఆమె ముద్దుముద్దు మాటలు అభిమానుల దృష్టిని ఆకర్షించాయి. తెలుగుతోపాటు తమిళ్ తోపాటు కన్నడ భాషలోనూ సినిమాలు చేసింది. అలాగే బాలీవుడ్ లోనూ నటించింది ఈ బ్యూటీ. హీరోయిన్ గానే కాదు స్పెషల్ సాంగ్స్ లోనూ మెప్పించింది. మెగాస్టార్ చిరంజీవి నటించిన ఆచార్య సినిమాలో స్పెషల్ సాంగ్ లో కనిపించింది. కాగా రెజీనా సినిమాల్లోకి రాక ముందు చిన్న వయసులోనే ఓ పిల్లల టీవీ ఛానల్ లో యాంకర్ గా చేసింది. 14 సంవత్సరాల వయస్సులో రెజీనా కసాంద్రా ప్రసన్న, లైలా జంటగా నటించిన తమిళ చిత్రం ‘కంద నాన్ మూ’లో లైలా చెల్లెలుగా నటించింది. ఆతర్వాత హీరోయిన్ గా మెప్పించింది. ప్రస్తుతం హిందీలో జెట్ అనే సినిమా చేస్తుంది రెజీనా. వరుసగా సినిమాలు చేసినప్పటికీ ఈబ్యూటీకి అంతగా సక్సెస్ అందుకోలేకపోయింది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంటుంది.




## బలమైన సందేశంతో ‘అభయ’.. 4 భాషల్లో రిలీజ్!

యోగిత భోసాలె ప్రధాన పాత్రలో రూపొందుతోన్న మహిళా సాధికారిక చిత్రం ‘అభయ’. ఎన్ఎస్ఇ లిస్టింగ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ గ్రాడియెంటే ఇన్ఫోటైన్‌మెంట్ లిమిటెడ్‌కు చెందిన ప్రముఖ నిర్మాత డా. విమల్ రాజ్ మాథుర్, ఆర్.డి.జి ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన శ్రీ రూపేష్ డి. గోహిల్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు యూసఫ్ ముజామ్మిల్ సుర్తి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ భాషల్లో రూపొందుతోంది. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. పోస్టర్ చూస్తుంటే మహిళా సాధికారితపై రూపొందుతోన్న పవర్‌ఫుల్ ప్రాజెక్ట్ ఇదని అర్థమవుతోంది. ఈ సందర్భంగా గ్రాండియెంటె ఇన్ఫోటైన్‌మెంట్ లిమిటెడ్ అధినేత, నిర్మాత డా.విమల్ రాజ్ మాథుర్ మాట్లాడుతూ “‘అభయ’ కేవలం సినిమా మాత్రమే కాదు..సమాజానికి బలమైన సందేశం. ఈ మూవీ ద్వారా తరతరాలుగా ఎందరికో ప్రేరణగా నిలుస్తోన్న మహిళల శక్తి, పట్టుదలను సెబ్రేట్ చేసుకోబోతున్నాం. సినిమా నాలుగు భాషల్లో రిలీజ్ కానుంది. ఈ రోజు పోస్టర్‌ను విడుదల చేయటం ఆనందంగా ఉంది. సినిమాకు సంబంధించిన వివరాలను త్వరలోనే తెలియజేస్తాం” అన్నారు. ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, నిర్మాత శ్రీ రూపేష్ డి. గోహిల్ మాట్లాడుతూ “‘అభయ’ టైటిల్ పోస్టర్‌ను విడుదల చేయటం ఆనందంగా ఉంది. ఈ మూవీ ఒక అర్థవంతమైన సందేశాన్ని అందించడమే కాకుండా, బలమైన కథనం, అద్భుతమైన నటీనటులతో రూపొందింది. ఈ ప్రేరణాత్మక సినిమాటిక్ అనుభవాన్ని త్వరలోనే దేశవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రావటానికి సన్నాహాలు చేస్తున్నాం” అన్నారు. ఈ చిత్రంలో యోగిత భోసాలె ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఈ సినిమాలో ఇంకా మోహన్ జోషి, గణేష్ యాదవ్, కమలేష్ సావంత్, అనికేత్ కేల్‌కర్, రోహిత్ కోకటి, ఉమేష్ బోల్కె, డా.సంజీవ్ కుమార్ పాటిల్, హర్ష్ నికమ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



## ప్రభాస్‌తో బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ భారీ ప్లాన్ ..

### ఫ్యాన్స్‌లో అంచనాలు పెంచుతున్న క్రేజీ కాంబో!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత బిజీ హీరోగా కొనసాగుతున్నారు. ‘బాహుబలి’తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రెబల్ స్టార్, ‘సలార్’, ‘కల్కి 2898 ఏడీ’ వంటి భారీ చిత్రాలతో తన మార్కెట్‌ను మరింత విస్తరించారు. ఇలాంటి సమయంలో ప్రభాస్‌కు సంబంధించిన ఓ కొత్త వార్త ఫిలింనగర్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. బాలీవుడ్‌లో వరుస విజయాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు ఆదిత్య ధర్, ప్రభాస్‌తో ఓ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ తెరకెక్కించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్రాథమిక స్థాయి చర్చలు కూడా జరిగినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అధికారిక ప్రకటన ఇంకా వెలువడకపోయినా, ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. భారీ యాక్షన్, దేశభక్తి నేపథ్య కథలు, ఎమోషనల్ డ్రామాలను అద్భుతంగా తెరకెక్కించడంలో ఆదిత్య ధర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మరోవైపు ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్, భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, పాన్ ఇండియా ఇమేజ్‌కు ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఉంది. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తే అది కేవలం ఇండియాలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా భారీ అంచనాలు సృష్టించే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రభాస్‌ను ఒక కొత్త యాక్షన్ అవతార్‌లో ఆదిత్య ధర్ చూపిస్తే బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు నమోదయ్యే అవకాశముందని చర్చ జరుగుతోంది. అయితే ఈ క్రేజీ కాంబో వెంటనే పట్టాలెక్కే అవకాశాలు కనిపించడం లేదు. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో ఇప్పటికే పలు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ‘ఫౌజీ’ చిత్రంలో ప్రభాస్ నటిస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్-లవ్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో ఇమాన్వి ఇస్మాయిల్ హీరోయిన్‌గా కనిపించనున్నారు. అలాగే దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న ‘స్పిరిట్’ కూడా ప్రభాస్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఒకటిగా భావిస్తున్నారు. మరోవైపు ‘కల్కి 2898 ఏడీ’ సీక్వెల్, ‘సలార్ 2’ చిత్రాలు కూడా నిర్మాణ దశలో ఉన్నాయి. దీంతో ప్రభాస్ షెడ్యూల్ వచ్చే రెండేళ్ల వరకు పూర్తిగా బిజీగా ఉండే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

## అవకాశాలు ఫుల్లు హిట్లు మాత్రం నిల్లు.. సాలిడ్ సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న శ్రీలీల

అందాల భామ శ్రీలీల.. తెలుగు సినీప్రియులకు పరిచయం అక్కర్లేనిపేరు. చేసింది తక్కువ సినిమాలే అయిన విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది ఈ అందాల భామ. తెలుగులో పెళ్లి సందడి సినిమాతో కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తొలి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. అందాల భామ శ్రీలీల.. తెలుగు సినీప్రియులకు పరిచయం అక్కర్లేనిపేరు. చేసింది తక్కువ సినిమాలే అయిన విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది ఈ అందాల భామ. తెలుగులో పెళ్లి సందడి సినిమాతో కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తొలి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత ధమాకా సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ సినిమాలో తన నటనతో ఆకట్టుకుంది శ్రీలీల.

ఈ మూవీ తర్వాత తెలుగులో శ్రీలీలకు వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. ధమాకా సినిమా తర్వాత అనేక ప్రాజెక్ట్స్ చేసినప్పటికీ ఆ స్థాయిలో హిట్టు మాత్రం రాలేదు. కానీ వరుసగా ఆఫర్స్ మాత్రం అందుకుంటుంది. అందం, అభినయంతోపాటు ఎనర్జిటిక్ డ్యాన్స్ తో ఆకట్టుకుంది. దీంతో తెలుగులో వరుస అవకాశాలు అందిపుచ్చుకుంది. ఓవైపు స్టార్ హీరోలకు జోడిగా నటిస్తూనే.. మరోవైపు కుర్రహీరోలస సరసన నటించింది. అయితే కొన్నాళ్లుగా ఈ బ్యూటీ నటించిన చిత్రాలు తెలుగులో ఫ్లాప్ అవుతున్నాయి. దీంతో ఇప్పుడు ఈ బ్యూటీ సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తుంది. అయితే వం-సగా ఫ్లాపులు వస్తున్నప్పటికీ శ్రీలీల డిమాండ్ మాత్రం తగ్గడం లేదు. ఇటీవలే పరాశక్తి సినిమాతో కోలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. శివకార్తికేయన్ హీరోగా నటించిన ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. తెలుగులో ఈ అమ్మడు ఇప్పటివరకు పది సినిమాల్లో నటించింది. వాటిలో హిట్ అయినవి రెండే రెండు సినిమాలు అందులో ఒకటి ధమాకా అయితే మరొకటి భగవంత్ కేసరి సినిమా.. అయితే భగవంత్ కేసరి సినిమా బాలయ్య ఖాతాలోకి వెళ్ళిపోయింది. ఇటీవలే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో నటించింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. దాంతో ఈ అమ్మడికి తెలుగులో ఆఫర్స్ తగ్గాయి. ప్రస్తుతం శ్రీలీల అవకాశాల కోసం ఎదురుచూస్తుంది. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంది. రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది శ్రీలీల. ఈ చిన్నదాని ఫోటోలకు ఫిదా అవుతున్నారు కుర్రకారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com